సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
సంపుటి: 21 సంచిక: 75
పేజీలు: 8 వెల: రూ.1
శుక్రవారం
20-6-2025









• ఎడిటోరియల్

# మిగులు జలాలపై హక్కు దిగువ రాష్ట్రాలదే

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య తాజా వివాదానికి బనకచర్ల ప్రాజెక్టుతో తెర లేచింది. చాలాకాలంగా ప్రతిపాదనల్లోనే ఉన్న నదుల అనుసంధానంతో పాటు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలను సస్య శ్యామలం చేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో తాగునీటి కొరత తీర్చేందుకు రాష్ట్రంలోని ఎన్డీయే ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించింది. దీని ద్వారా గోదావరి నుంచి పోలవరం ప్రాజెక్టు కాలువ ద్వారా 200 టీఎంసీల జలాలను కృష్ణాలోకి, అక్కడి నుంచి పెన్నా నదిలోకి మళ్లించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. అయితే ఈ ప్రాజెక్టుపై ఎగువన ఉన్న మన దాయాది తెలంగాణ రాష్ట్రం అభ్యంతరాలు లేవనెత్తుతోంది. గోదావరి జలాలను తరలిస్తే ఆ నదిపై తమ రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టు వట్టిపోయి, తాము నష్టపోతామన్న రీతిలో వాదిస్తోంది. బనకచర్లను ఆమోదించవద్దని కేంద్ర జలసంఘాన్ని, జలవనరుల మంత్రిత్వశాఖను డిమాండ్ చేస్తోంది. దీనిపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకంగా అఖిలపక్ష సమావేశం నిర్వహించి ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఏకాభిప్రాయంతో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయితే ఆంధ్రప్రదేశ్ వాదన మరోలా ఉంది. సముద్రంలో వృథాగా కలుస్తున్న 3వేల టీఎంసీల జలాల్లో 200 టీఎంసీలను తాము బనకచర్లకు తరలించాలని భావిస్తున్నామని చెబుతోంది. గత 50 ఏళ్ల గోదావరి నదీ ప్రవాహ రికార్డులు పరిశీలిస్తే.. దాదాపు ప్రతి ఏటా సగటున 3వేల టీఎంసీల గోదావరి వరదనీరు బంగాళాఖాతంలో కలుస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇక అంతర్ రాష్ట్ర నదీ జలాల పంపిణీ, వివాదాలను పరిశీలిస్తే.. దేశంలో ఏర్పాటైన అన్ని నదీ జలాల ట్రిబ్యునళ్లు పరీవాహక రాష్ట్రాలకు దామాషా పద్ధతిలో నీటి కేటాయింపులు చేస్తుంటారు. ఆయా నదుల్లో సగటున లభించే నికర జలాలను లెక్కగట్టి దాని ఆధారంగా రాష్ట్రాలకు వాటాలు నిర్ణయిస్తారు. ఇక నికర జలాలు పోను వర్షాకాలంలో అదనంగా పారే వరద నీటిని (మిగులు జలాలు) వినియోగించుకునే హక్కును దిగువ రాష్ట్రాలకే కల్పిస్తున్నాయి. ఆ విధంగా గోదావరి నదీ ప్రవహించే మహారాష్ట్ర, నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మధ్య నికర జలాల పంపిణీ జరిగింది. ఏపీ విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన తెలంగాణకు ఏపీ వాటా నుంచి నికర జలాలు కేటాయించారు. ఇక ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడూ, ఇప్పుడూ దిగువ రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు మిగిలు జలాలను వినియోగించుకునే హక్కు కట్టబెట్టారు. ఇప్పుడు బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ఆ మిగులు జలాల నుంచే 200 టీఎంసీలను రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల సాగు, తాగునీటి అవసరాలకు వాడుకోవాలని ఆంధ్రప్రదేశ్ భావిస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 80 లక్షలమందికి సురక్షిత తాగునీరు అందుతుంది. అలాగే సుమారు 12 లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి వస్తాయి. ఆంధ్రకు ఇంత భారీ ప్రయోజనం చేకూర్చే ఈ ప్రాజక్టు తమకు నష్టదాయకమని తెలంగాణ వాదిస్తోంది. దీనికి కేంద్ర జలవనరుల శాఖకు చెందిన అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేదని, అలాగే కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల ఆమోదం కూడా లేదని వంకలు పెడుతోంది. అయితే ఈ వాదనను ఏపీ తప్పుపడుతోంది. ప్రాజెక్టు ప్రతిపాదనలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని వారు గుర్తు చేస్తున్నారు. ప్రాజెక్టు ప్రీ ఫీజిబులిటీ రిపోర్టును మే 22న ఏపీ ప్రభుత్వం సెంట్రల్ వాటర్ కమిషన్‌కు సమర్పించింది. కేంద్ర పర్యావరణ నిపుణులు కమిటీ ఈ నెల 17న చర్చించింది. మరోవైపు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) సమర్పించడానికి ఏపీ నీటిపారుదల శాఖ కసరత్తు చేస్తోంది. మూడు దశల్లో చేపట్టే ఈ ప్రాజెక్టు విషయంలో అనవసర రాద్ధాంతం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం తమ రాష్ట్రంలో చేస్తున్నదేమిటని ఆంధ్రప్రదేశ్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. అనుమతులు లేకుండానే గోదావరి జలాలపై కాళేశ్వరం, సీతారామసాగర్, పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క బ్యారేజీలను నిర్మిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. దిగువ రాష్ట్రంగా మిగులు జలాలను వినియోగించుకునే హక్కు ఆంధ్రకు ఉందని తెలిసి కూడా అభ్యంతరం చెప్పడానికి తప్పు పడుతున్నారు. ప్రతి ఏటా వర్షాలు, వరదల సమయంలో అదనంగా దిగువకు పారే జలాలను రోజుకు రెండు టీఎంసీలు చొప్పున వంద రోజుల్లో 200 టీఎంసీలు తీసుకుని బనకచర్లకు వాడుకుంటామని, దీని వల్ల తెలంగాణకు ఏవిధంగా నష్టం జరుగుతుందన్నది మాత్రం ఆ రాష్ట్ర ప్రభుత్వం చెప్పలేకపోతున్నదని అంటున్నారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం ప్రతిపాదనలను కేంద్ర జలవనరుల శాఖకు పంపాం. దానిపై అభిప్రాయాలు కోరుతూ కేంద్రం పరీవాహక రాష్ట్రాలను కోరింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే అక్కడ చెప్పుకొనే అవకాశం ఉన్నా తెలంగాణ నేతలు, ప్రభుత్వం రాజకీయ కారణాలతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ రచ్చ చేయడం తగదు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నియోజకవర్గ పరిధి ఎల్.ఎన్.పేట మండలంలో గల కరకవలస పంచాయతీ, శ్యామలాపురం గ్రామానికి చెందిన కర్ణం రాము నోటి క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స చేయించేందుకు కుటుంబసభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వద్ద విన్నవించుకోగా ముఖ్యమంత్రి సహాయ నిధికి ధరఖాస్తు చేశారు. దీంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.4లక్షల చెక్కును తన భార్య పిల్లలకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి, సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకునే ఆర్థికస్థోమత లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఈ ఎన్డీఏ ప్రభుత్వం అని తెలియజేశారు. పార్టీలకతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎంఆర్ ఎఫ్ నిధులు అందిస్తున్నారన్నారు. గత పాలకుల హయాంలో ఈ ప్రాంతం నుంచి సీఎం సహాయనిధికి ఒక్క దరఖాస్తు కూడా చేసిన దాఖలాలు లేవన్నారు.



## యోగా దినోత్సవం సందర్భంగా రావి ఆకుపై మోడీ యోగా విన్యాసాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరగనున్న సందర్భంగా స్థానిక నగరానికి చెందిన ప్రముఖ ఆధునిక చిత్రకారుడు వాడాడ రాహుల్ పట్నాయక్ రావిఆకుపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ చిత్రంతోపాటు వివిధ భంగిమల్లో యోగా విన్యాసాలను చిత్రీకరించాడు. ఈ చిత్రం వీక్షకులను బహుధా ఆకట్టుకుంటుంది. రాహుల్ జాతీయ, అంతర్జాతీయస్థాయిల్లో ఎన్నో పురస్కారాలు పొందారు. పక్షుల వెంట్రుకలపై శ్రీనివాస కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం, శ్రీకృష్ణ రాసలీల ఘట్టాలతో పాటు సింహాద్రి అప్పన్న, ఈశ్వరుడు, వినాయకుడు తదితర చిత్రాలు వేశారు. అలాగే స్వామి వివేకానంద, భారతీయ చిత్రకారుడు రాజా రవివర్మ, ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా చిత్రాలను పక్షివెంట్రుకలపై అపురూపంగా వేశారు. పాఠశాలల గోడలపై ఎన్నో విద్యా సంబంధిత చిత్రాలను వేసి ప్రశంసలు పొందారు. గత రెండు దశాబ్దాలుగా లలితకళలల్లో ఒకటైన చిత్రలేఖనానికి విశిష్ట సేవలందిస్తున్నారు. ఆయా రచయితల పుస్తకాలకు ముఖ చిత్రాలు వేసి కళాప్రియుల హృదయాలను దోచుకుంటున్నారు. బియ్యపు గింజలపై సయితం చిత్రాలను వేసి తన సత్తా చాటుకుంటున్నాడు. అమెరికా బుక్ ఆఫ్ వరల్డ్, రావా బుక్ ఆఫ్ వాల్ రికార్డ్స్, ఆస్కార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, హై రేంజ్ వరల్డ్ రికార్డ్స్, గ్రేట్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, గిన్నీస్ బుక్‌లో స్వర్ణ పతకం సాధించాడు. ఈ రికార్డులలో సముచిత స్థానం పొందాడు. పక్షుల వెంట్రుకలపైన, బియ్యపు గింజలపై వేసిన చిత్రాలకుగాను ఈ అవార్డులను సొంతం చేసుకున్నాడు. గత ఏడాది డిసెంబర్ 30న విశాఖపట్నం చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాహుల్‌కు వడ్డాది పాపయ్య స్మారక పురస్కారాన్ని నిర్వాహకులు సుంకరి చలపతి రావు చేతుల మీదుగా ప్రధానం చేశారు. వడ్డాది గీచిన వందలాది చిత్రాలను సూక్ష్మీకరించి అందంగా తీర్చిదిద్దిన సంగతి తెలిసిందే. కాగా ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా 82వ పుట్టినరోజు సందర్భంగా ఆయన సూక్ష్మ చిత్రాలను మొబైల్ సిమ్ కార్డులపై వేసి మరో చరిత్రను సృష్టించారు. ఈ చిత్రాలకు ఒకేసారి ఏడు ప్రపంచ రికార్డులు లభించడం వెనుక రాహుల్ ప్రతిభా పాటవాలేమిటో స్పష్టం చేస్తోంది. జీనియస్ చార్మ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్(తమిళనాడు), వరల్డ్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్(తమిళనాడు), సెంట్రల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్(స్పెయిన్), తెలంగాణ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ప్రెస్టేజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుండి మూడు (ఉత్తరప్రదేశ్) గ్రహించారు.







## యోగా దినోత్సవ సన్నాహక ర్యాలీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. శనివారం జరగబోయే యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకే భూమి- అందరికీ ఆరోగ్యం, యోగ సాధన చేయండి- ఆరోగ్యాన్ని పొందండి వంటి నినాదాలతో అవగాహన కల్పించారు. శనివారం జరిగే యోగా దినోత్సవంలో గ్రామంలోని పిల్లలు, పెద్దలు, స్త్రీలు పురుషులు తమతర బేధం లేకుండా పాల్గొనాలని యోగాసనాలతో పాటు ప్రాణాయామం కూడా మానసిక ఆరోగ్యానికి దోహద పడుతుందని నినాదాలు చేశారు. దీనిని ప్రధానమంత్రికి స్వాగతం ర్యాలీగా భావించాలన్నారు. తమ రాష్ట్రానికి గర్వకారణమైన రోజు అని ఉపాధ్యాయులు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లేశ్వరరావు, ర్యాలీ ఆర్గనైజర్ దామోదర్ రావు, ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం గోపాలరావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, ప్రసాద్‌రావు, పురుషోత్తం, కృష్ణ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు




## ఘనంగా మాక్ యోగా

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

విశాఖపట్నంలో ఈనెల 21న ప్రధాని నరేంద్రమోడీ ముఖ్యఅతిథిగా నిర్వహించబోయే అంతర్జాతీయ యోగా డే (యోగాంధ్ర) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన మాక్ యోగా కార్యక్రమంలో ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, సీనియర్ నాయకులు మొదలవలస రమేష్, నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్ సనపల ఢిల్లీ, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.





ఇది కుబేర సినిమా ప్రమోషన్..వాక్యం కాదు. చాలా వాటికి నచ్చుతాడితడు. తొలి సినిమా' ఈ దేశపు రాజకీయాల మీద. చూశాక, ఇతను కచ్చితంగా త్వరలో ఫేడ్ అవుట్ అవుతాడని అనుకున్నాను. కొనడం,అమ్మడం మాత్రమే తెలిసిన భారత రాజకీయాల మీద తీసిన ఆ సినిమా ఏ మాత్రం మారడానికి వీలు కానీ, లేని ఇండియన్ రాజకీయాల గురించి కుండబద్దలు కొట్టినట్టు చెప్పింది. అయితే అంత సీరియస్ ట్రాక్ లో కూడా దర్శకుడు లవ్ ట్రాక్ దగ్గర దొరికిపోతాడు. అతని సినిమాల్లో మ్యూజిక్ సినిమాలోని క్యారెక్టర్ ఆత్మను పట్టుకుంటుంది. ఎక్కడ వెలగాలో అక్కడ ఖచ్చితంగా అది వెలుగుతుంది. అక్కడ మొదలైంది. అతని సినిమాని పరిశీలనగా చూస్తూ ప్రేమించడం. ఇక బ్యానర్ మీద డైరెక్టర్ శేఖర్ కమ్ముల పేరు చూసి సినిమా చూడడం కొంచెం అలవాటు.

పల్లెటూర్లు ఊరి చివరి చెరువు ఏమాత్రం భేషజాలు పోకుండా అందర్నీ కలిపే నది. పువ్వులకు నీళ్లు పోసే అమ్మాయి అంతఃపురాలు దాటి అటువంటి అమ్మాయి కోసం కఠినమైన ఎండలో నిలబడే అబ్బాయి అనేక రకాల అహంకారాలను కడిగేసే వాన రకరకాల గీతలు చెరిపే మనుషులు అందరినీ బతికించే ప్రేమ మనుషుల మధ్య ప్రేమలు పంచే దేవుడు జీవితాన్ని పరిపుష్టం చేసే స్వేచ్ఛ కోసం తపించే అమ్మాయిలు ఇట్లా ఒక్కరేమిటి, అతను ' సినిమా ద్వారా ఈ ప్రపంచానికి ఏదైనా ఒక మంచి చెప్పాలనుకుంటున్న రుషిలాగా అనిపిస్తాడు.

# శేఖర్ కమ్ముల.. చాలావాటికి నచ్చుతాడు!

' ఆనంద్' చాలాసార్లు చూసినప్పుడల్లా ఎందుకు ఇష్టం ఉంటుందో కానీ, చిరాకుగా ఉన్నప్పుడు ' సింక్ దగ్గర మాటిమాటికి నీళ్ల పంపు కు అడ్డం పడుతున్న జుట్టును అదాటును కత్తిరించే హీరోయిన్ని చూడగలిగిన వాడు ఎందుకు నచ్చడు.? అయితే, పేద పిల్లల కోసం దిగివచ్చే' కుబేరులు' అనే ఇతని ఆదర్శం మీద నాకు కొంచెం కినుక ఉండేది, ఉంటుంది కూడా. ఇక 'లవ్ స్టోరీ' దగ్గర ఎంత నచ్చేసాడో చెప్పలేను. ' ఎక్కడపడితే అక్కడ, గుండెల్లోకి కలుక్కుమని గుచ్చుకునే కులం పీడన' అందరికీ అర్థం కాదు. ముఖ్యంగా ఫ్యూడల్ కులం నుండి, సాఫ్ట్వేర్ ఉద్యోగం ద్వారా అమెరికాలో తిరిగి, ఇండియాకి వచ్చే వాళ్లకు. కానీ ఇతను దానిని దాటేశాడు. అర్థం ఐనోళ్ళకి దాటడం ఎంత అవసరమో తెలుస్తుంది. గీతలు చెరిపివేయగలగటం ఒక పెద్ద సాహసమే. ఆ సాహసాన్ని చాలా చోట్ల చేశాడు ఇతను.

'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' అని చెప్పే ఇతను, మిడిల్ క్లాస్‌కి అప్పర్ క్లాస్‌కి మధ్య గీతలు చెరిపేయాలని, ఆడే క్రికెట్ ద్వారా చెప్పడమే కాదు' ఎగురుతున్న విమానంలో, ప్రమాదాలను చెరిపేసే ప్రేమను కూడా చెప్పినప్పుడు' ఇతను ఈ నేల కోల్పోయిన అమ్మ ప్రేమ ఏదో మళ్లీ మళ్లీ చెప్పాలనుకుంటున్నాడని భలే ఇష్టం వేసింది. అన్ని అంతే. గోదావరి నుంచి లవ్ స్టోరీ దాకా. అతని సినిమాలు ఫ్రెష్‌గా ఉంటాయి. మనకు బాగా తెలిసిన క్యారెక్టర్స్ లోని కొత్తగా తెలిసే అద్భుతమైన మనస్తత్వం లాగా. ప్రేమ తెలియడం గొప్ప కాదు. ప్రేమించడం ఎలాగో తెలియజేయడం గొప్ప. సమాజంని అస్తవ్యస్తం చేస్తున్న ' గీతలు' ఏవో తెలియడం గొప్పకాదు. ఆ గీతల్ని చెరిపి వేయడం ఎట్లాగో తెలియడం గొప్ప. మన జీవిస్తున్న సమాజంలో' తప్పులు' ఏవో తెలియడం గొప్పకాదు. ఆ తప్పుల్ని సరిదిద్దుకోవడం ఎలాగో తెలియజేయడం గొప్ప. వంశాలు,డిఎన్ఏలు జబ్బ చరుచుకునే చోటే దొంగలు, మాఫియాలు అడ్డగోలుగా బాక్స్ ఆఫీస్‌లో డబ్బును దోచుకునే చోటే వికసితభారతం 75 ఏళ్ల తర్వాత కూడా ప్రజాస్వామ్యం అంచులు కూడా తాకడానికి సాహసించనప్పుడు, సిగ్గులేకుండా రాజరికాన్ని బాహాటంగా ప్రచారం చేస్తున్నప్పుడు ఇతను ఒకడు మనిషిలోని సున్నితమైన స్పందన కోసం అతనిలో రావాల్సిన మార్పు కోసం అతనిని వెలిగించే ప్రేమ కోసం మానవ సంబంధాలు విచ్ఛిన్నం చేస్తున్న సంపదదాహం నిర్మూలన కోసం మన ఎదురుగా ఒక పసి పిల్లవాడు పొద్దుపొద్దున్నే మంచులో తడిసిన ఒక పువ్వు ఇచ్చినట్టుగా మనతో మాట్లాడుతాడు చూడూ' ఇది నచ్చుతుంది. నిజం కుబేర సినిమా గురించి అసలు కాదు. కానీ రోడ్డుమీద బండిని డ్రైవ్ చేస్తూ వెళ్తున్నప్పుడు ఎందుకు' కుబేర' సినిమా పోస్టర్ నా చూపుని లాక్కెడుతుందో తెలియదు. ముఖ్యంగా దుమ్ము కొట్టుకున్న, మురికి చొక్కాతో మంచి క్లాసికల్ పోస్టర్స్ మీద దిగాలుగా నించున్న' ధనుష్' బొమ్మ. ఎందుకురా ఇప్పటికే పేరుకుపోయిన అబద్ధాలతో మరింత నాశనం చేస్తారు మనసుల్ని. కాస్త అతని చూసి కొంచెం నేర్చుకోవడానికి ప్రయత్నించండి. కుబేర' థియేటర్లోనే చూస్తాను. - డాక్టర్ నూకతోటి రవికుమార్

## షోకేస్‌లో బార్బీలా సోనాల్ సొగసు

సోనాల్ చౌహాన్ పరిచయం అవసరం లేదు. స్టార్‌డమ్ కోసం సుదీర్ఘకాలం పోరాటం సాగించిన కథానాయికల్లో ఈ ముంబై బ్యూటీ పేరు లిస్ట్‌లో ఉంది. కానీ స్టార్‌డమ్ అనేది ఏ కొందరికో చిక్కే ఆయాచిత వరం. టాలీవుడ్‌లో వరుసగా అగ్ర కథానాయకుడు బాలకృష్ణ సినిమాల్లో నటించినా ఆశించినది దక్కలేదు. అటు బాలీవుడ్ లోను కొన్ని యూత్ ఫుల్ లవ్ స్టోరీస్‌లో నటించింది. బంగ్లాదేశ్ స్టార్ హీరో సరసన కూడా సోనాల్ ఓ చిత్రంలో నటించింది. కానీ ఆ సినిమాకి సంబంధించిన తాజా అప్డేట్ రాలేదు. ప్రస్తుతం సోనాల్ తన అభిమానులకు సోషల్ మీడియాల ద్వారా టచ్‌లో ఉంది. నిరంతరం వేడెక్కించే స్పెషల్ ఫోటోషూట్లతో సోనాల్ ఎక్స్ క్లూజివ్ ట్రీటిస్తోంది. అందమైన పసుపు రంగు ఫ్రాక్‌లో సోనాల్ అందచందాలు, మనోహరమైన రూపం కుర్రకారుకు మత్తెక్కిస్తున్నాయి. షోకేస్‌లో బార్బీలా సోనాల్ సొగసు మత్తెక్కిస్తోంది అంటూ అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. "నేను కవర్ కోసం సరైన రూపాన్ని ఎంచుకున్నానా?" అనే ట్యాగ్ లైన్ తో ఈ ఫోటోషూట్‌ని షేర్ చేసింది సోనాల్. దీనిని బట్టి ఈ బ్యూటీ ఒక మ్యాగజైన్ కవర్ పేజీ కోసం ఫోటోషూట్ చేసిందని అర్థమవుతోంది. 2022 లో ఎఫ్ 3- ఫన్ అండ్ ఫ్రస్టేషన్, ఘోస్ట్ సినిమాల్లో నటించింది. ఆ తర్వాత ప్రభాస్ ఆదిపురుష్ లో మండోదరి పాత్రలో కనిపించింది. ఇటీవల సోనాల్‌కి తెలుగులో అవకాశాలు లేవు. ప్రస్తుతం సోనాల్ తెలుగులో అగ్ర దర్శకనిర్మాతలకు ఫీలర్స్ వదులుతోంది. మరాఠాలోను నటించేందుకు కథలు వింటోందని తెలిసింది. తదుపరి పెద్ద ప్రాజెక్ట్ గురించి ప్రకటన వెలువడాల్సి ఉంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..



# స్త్రీలు అంత ప్రమాదకారులా?




మేఘాలయకి హనీమూన్ కోసం వచ్చిన కొత్త జంటలో భర్త రాజా రఘువంశీ భార్య సోనం కుట్రలో భాగంగా హత్యకి గురవ్వడం సంచలనం రేపింది. ఆ హత్యని కేవలం అమానుష మనస్తత్వం వున్నవారే సమర్థించగలరు కానీ ఇదే సందు అని ఇష్టం లేని పెళ్లిళ్లు చేసుకున్న స్త్రీలందరూ ఏదో విలన్లైనట్లు, వారి నుంచి భర్తల ప్రాణాలకు ముప్పు వున్నట్లు, పెళ్లి కాని యువకులు ఈ విషయంలో అప్రమత్తంగా వుండాలన్నట్లు కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. వీడియోలు చేస్తున్నారు. కేసు ఓ కొలిక్కి వచ్చిన 20 రోజుల తర్వాత కూడా స్త్రీల పట్ల అవమానకరంగా రీల్స్, మీంస్, యూట్యూబ్ వీడియోస్ చేస్తున్నారు. మొత్తంగా స్త్రీలంటే ప్రమాదకర శక్తులైనట్లు ఆ రాతలు, రీల్స్, మీంస్ అఘోరించాయి.

మేఘాలయ హనీమూన్ మర్డర్ కేసుగా ప్రాచుర్యం పొందిన కేసులో సోనం, ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహ్ మాత్రమే నేరస్తులు కాదు నా దృష్టిలో. తనకి ఈ పెళ్లి ఇష్టం లేదని చెప్పినప్పటికీ పట్టించుకోని ఆమె తల్లిదండ్రులు కూడా నేరస్తులే. ఇష్టం లేని పెళ్లి చేస్తే 'నేనేం చేస్తానో చూడండి. అందుకు మీరే బాధ్యులు" అని సోనం తన పేరెంట్స్ని హెచ్చరించిందట. ఐనా ఆమె పేరెంట్స్ పట్టించుకోలేదు. ఆమె పెళ్లికి ముందే మర్డర్ ప్లాన్కి ఫిక్స్ అయిపోయినట్లుంది. అందుకే తన మీద అనుమానం రాకూడదని పెళ్లికి సంబంధించిన సంబరాల్లో హుషారుగా కనిపించింది. ఆ హుషారు నిజమైనదైతే ఆమె మర్డర్ ప్లాన్ ఎందుకు చేస్తుంది?

రఘువంశీ పట్ల ఆమె సోనం వ్యవహరించిన మోసపూరిత ప్రేమ, కుట్ర పన్నిన తీరు, చంపిన విధానం అమానుషమైంది. అమాయకుడైన భర్తని ఆమె కడతేర్చడం ఎవరూ అంగీకరించలేం. ఐతే సోనం స్త్రీ జాతి ప్రతినిధిగా భావించడం, ఆమె వంటి వారు చేసే దారుణమైన పనుల వల్ల మొత్తం పురుష జాతి ప్రమాదకర పరిస్థితుల్లో పడిందన్నట్లు కృత్రిమ ఆందోళనలు వ్యక్తం చేయడం సోనం వంటి వారు చేసే పాప కార్యాల్ని మించిన పాపకార్యం! ఈ రకమైన సూడో ఆందోళనలు వ్యక్తం చేసే వారిలో స్త్రీలు కూడా వున్నారు. వీరందరూ మర్చిపోయిన విషయం ఏమంటే వేళ్ల మీద లెక్క పెట్టగల సంఘటనల్ని భూతద్దంలో బ్లో అప్ చేసి చూపించినా అవి దేశవ్యాప్తంగా స్త్రీల మీద, ఆడపిల్లల మీద జరిగిన, జరుగుతున్న అత్యాచారాల ముందు పిపీలకాలే. పితృస్వామ్యం సంస్కృతి పేరుతో తన బలి పశువుల చేతనే ఎక్కువగా పొగిడించుకుంటుంది. పీడక శక్తుల కోసం పీడిత వర్గాలే కన్నీరు కార్చేలా చేస్తుంది. ఇదో రకమైన వ్యూహం.

సోనం-రఘువంశీ-రాజ్ కుష్వాహ్ల మొత్తం ఎపిసోడ్ గమనిస్తే ప్రేమ గుడ్డిదని కొంతమందికి అనిపించొచ్చు. ప్రేమ గుడ్డిదో, కుంటిదో కాదు. ప్రేమ మనిషి భావోద్వేగాల్లో భాగం. కొంతమంది తమ భావోద్వేగాల మీద నియంత్రణని కోల్పోతుంటారు. ఆ ఉరవడిలో పడి కొట్టుకుపోతుంటారు. ప్రేమకి సంబంధించిన భావోద్వేగం ఇందుకు అతీతం కాదు. ఎలాంటి నియంత్రణ లేకుండా, వాస్తవిక దృష్టి లోపించి ప్రేమే



సర్వస్వం అనుకుంటే, అలాంటి ప్రేమ ఉచ్ఛస్థాయిలో మనిషి స్వార్థపూరిత భావోద్వేగాల్లో భాగమైనప్పుడు ఇలాంటి దారుణాలు జరిగే అవకాశం వుంటుంది. ఇందుకు స్త్రీలు మినహాయింపు కాదు. ప్రియుడితో కలిసి జీవించడానికి అడ్డుగా వున్నారని పిల్లల్ని చంపుకునే తల్లులు కూడా ఇదే కేటగిరీ కిందకే వస్తారు. ఇందుకు ఆ స్త్రీలు ఎదుర్కొంటున్న జీవితం పట్ల అసంతృప్తి, ప్రేమరాహిత్యం నియంత్రణ లేని ఆవేశాలకు దారి తీయడం కారణం. ఐతే ఇలాంటి కొందరు స్త్రీలు చేసే దారుణాలు మొత్తం స్త్రీల మనస్తత్వానికి, ప్రవర్తనకి అంటగట్టడం మాత్రం మూర్ఖత్వం.

గత మూడు దశాబ్దాలుగా స్త్రీలు బాగా చదువు కుంటున్నారు. బాగా చదువుకోవడం వల్ల సమాన ఉద్యోగావకాశాలు వస్తున్నాయి. పెరిగిన ఉద్యోగ అవకాశాల వల్ల స్త్రీలకి ఆర్థిక స్వావలంబన చేకూరింది. స్త్రీ ఆర్థిక స్వావలంబన కుటుంబ అభివృద్ధికి దోహదం చేస్తుంది. మొత్తంగా స్త్రీకి ప్రాముఖ్యత పెరిగి, ఆమె ఆత్మవిశ్వాసం ఇనుమడించే వాస్తవికత పెరుగుతున్నది. ఎన్ని సాధించినా, సంపాదించినా చివరికి పురుషుడికి దాసోహమనే సంస్కృతిని నేటి యువతి అంగీకరించడం లేదు. అందుకే నేటి యువతి సమాజానికి ఓ సాంస్కృతిక దిగ్భ్రాంతి (కల్చరల్ షాక్)గా కనిపిస్తున్నది. ఇక్కడే మొత్తం సమాజం స్త్రీల పట్ల తనకి వున్న దృక్పథాన్ని పరిశీలించుకోవాలి, పునరాలోచించుకోవాలి, పునర్మూల్యాంకనం చేసుకోవాలి. ఆమె ప్రాముఖ్యతని గుర్తించాలి. తొక్కిపెట్టినంత కాలం తొక్కిపెట్టాం, ఇంక సాధ్యం కాదని గుర్తించాలి.

నేటి స్త్రీ శక్తివంతంగా తయారవుతున్నది. మేథో పరంగా, ఉత్పత్తిపరంగా, పరిపాలనాపరంగా, రాజకీయంగా ఆమె సమాజానికి ఎంతో కాంట్రిబ్యూట్ చేస్తున్నది. ఆమెని ఇంకా సంతాన పునరుత్పత్తి వనరుగా, వంటింటి కుందేలుగా చూస్తున్నంత కాలమూ వైరుధ్యం పెరిగి, హింస పెచ్చరిల్లుతుంది. అంతిమంగా సామాజిక అశాంతి పెరుగుతుంది. కుళ్లు జోకులు, కృత్రిమ భయపు రాతలు, వెకిలి రీల్స్, అతి తెలివి యూట్యూబ్ వీడియోస్ మానేసి ఆమె స్వప్నాల్ని, ఆశల్ని, ఆకాంక్షల్ని గౌరవించి, నిజమైన అర్థంలో సమానత్వం సాధించడంలో దోహదపడగలిగితే స్త్రీ పురుష సంబంధాలకు సంబంధించినంత వరకు మొత్తం సమాజం ప్రశాంతంగా వుంటుంది.

- అరణ్యకృష్ణ

# బాంబులు.. క్షిపణులు భయపెట్టలేవు

## 'ది డిప్లొమాట్' జేపీ సింగ్ గురించి తెలుసా?



కాబూల్లో బాంబు దాడులు.. పాకిస్థాన్లో ఉద్రిక్తతలు.. ఇజ్రాయెల్లో క్షిపణులు.. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో దృఢమైన, సమర్థమైన దౌత్యం అత్యవసరమైన వేళ భారత్ చూపు ఆయనవైపే తిరుగుతుంది. ఎలాంటి భయానక క్షణాల్లోనైనా చాకచక్యంగా దౌత్యం నెరపగల నేర్పరి ఆయన. అందుకే వెండితెర కూడా ఆయన స్ఫూర్తిని సమాజానికి చాటింది. ఆయనే 'ది డిప్లొమాట్' జేపీ సింగ్. ప్రస్తుతం రణరంగంగా ఉన్న ఇజ్రాయెల్ నుంచి భారతీయులను తరలించే 'ఆపరేషన్ సింధు'కు నేతృత్వం వహిస్తున్నారాయన..! ఇంతకీ ఎవరీ జేపీ సింగ్..?

**బాంబు దాడిని తప్పించుకుని..**

ఇండియన్ ఫారిన్ సర్వీస్లో 2002లో చేరిన జేపీ సింగ్.. దౌత్యవేత్తగా కెరీర్ ప్రారంభించారు. తొలినాళ్లలో మాస్కోలోని భారత మిషన్లో విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత 2008లో కాబూల్లోని భారత దౌత్య కార్యాలయంలో ఫస్ట్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారు. 2008-12 వరకు ఆయన విధులు నిర్వర్తించిన సమయంలో అఫ్గానిస్థాన్లో అనేకసార్లు దాడులు జరిగాయి. ఒకసారి ఎంబసీ మీద బాంబు దాడి చేయగా.. జేపీ సింగ్తో సహా దౌత్యసిబ్బంది త్రుటితో తప్పించుకున్నారు.

**ఉజ్మా అహ్మద్ను కాపాడి..**

జేపీ సింగ్ పేరు తొలిసారి వార్తల్లో మార్మోగింది మాత్రం పాకిస్థాన్లో విధులు నిర్వర్తిస్తున్న సమయం లోనే. 2014-19 మధ్య ఆయన ఇస్లామాబాద్లో డిప్యూటీ హైకమిషనర్గా పనిచేశారు. ఆ సమయంలో ఉజ్మా అహ్మద్ అనే మహిళను కాపాడటంతో వార్తల్లో నిలిచారు. దిల్లీకి చెందిన ఉజ్మాకు ఆన్లైన్లో తాహిర్ అలీ అనే వ్యక్తితో పరిచయమైంది. అతడిని కలిసేందుకు సరిహద్దు దాటి పాక్ వెళ్లింది. అక్కడ తాహిర్ ఆమెను పెళ్లి చేసుకుని తీవ్ర వేధింపులకు గురి చేశాడు. ఆ చిత్రహింసల నుంచి ఆమె తప్పించు కుని భారత హైకమిషన్కు చేరుకుంది. అక్కడ ఆమెను చేర దీసిన జేపీ సింగ్.. ఉజ్మా తరఫున న్యాయ పోరాటం చేశారు. స్వయంగా లాయర్ను ఏర్పాటు చేసి అంతర్జాతీయ న్యాయస్థానాలకు పంపించారు. ఆయన పోరాటం ఫలించి ఆమె సురక్షితంగా భారత్ చేరుకుంది. ఆయన కథ నుంచి స్ఫూర్తి పొందే ఈ ఏడాది బాలీవుడ్ కథానాయకుడు జాన్ అబ్రహం ప్రధాన పాత్రలో 'ది డిప్లొమాట్' సినిమా తెరకెక్కింది. ప్రేక్షకులను అలరించింది.

**తాలిబన్లతో చర్చలు..**

ఇస్తాంబుల్లో కాన్సుల్ జనరల్గా విధులు నిర్వర్తించిన అనంతరం కేంద్ర విదేశాంగ శాఖలో కీలక బాధ్యతలు చేపట్టారు. ఏడాది పాటు చీఫ్ ఆఫ్ స్టాఫ్గా పనిచేశారు. గతేడాది అఫ్గానిస్థాన్లోని తాలిబన్ విదేశాంగ మంత్రితో భారత్ చర్చలు జరిపిన బృందంలో ఈయన కూడా ఉన్నారు. తాలిబన్ ప్రభుత్వంతో న్యూదిల్లీ అధికారికంగా భేటీ అవ్వడం అదే తొలిసారి.

**ఇజ్రాయెల్కు పంపించి..**


హై రిస్క్ జోన్లో సమర్థంగా దౌత్యవ్యవహారాలు చూడడంలో జేపీ సింగ్ నేర్పరి. అందుకే విదేశీ గడ్డపై సంక్షోభ పరిస్థితుల్లో దౌత్యవేత్తగా భారత్ ఆయననే ఎంచుకుంటుంది. పశ్చిమాసియాలో గత రెండేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని.. ఈ ఏడాది ఆరంభంలో జేపీ సింగ్ను ఇజ్రాయెల్కు భారత రాయబారిగా కేంద్రం నియమించింది. దీంతో ఆయన మరోసారి రంగంలో దిగారు. ప్రస్తుతం ఆ యుద్ధ క్షేత్రంలో చిక్కుకున్న భారతీయ విద్యార్థులు, పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించడమే జేపీ సింగ్ ముందున్న బాధ్యత. ఇందుకోసం కేంద్రం ప్రారంభించిన 'ఆపరేషన్ సింధు'ను ఆయన భుజానికెత్తుకున్నారు. ఇజ్రాయెల్లోని భారత పౌరులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ వారి భద్రతకు భరోసా కల్పిస్తున్నారు.

- సత్యం ఐటీ డెస్క్

# మోక్షానికి పాస్పోర్ట్ అక్కర్లే..!

## రష్యా సైనికుడి అంతిమ ప్రయాణం!

**హైందవ ధర్మం, సనాతన సంప్రదాయాలతో పాటు, వివిధ రకాల మతాలు, వాటి పవిత్ర గ్రంథాల వంటివాటిపై భిన్నరకాల అభిప్రాయాలతో సమాజంలో ఓవైపు విస్తృతమైన చర్చ జరుగుతోంది. అదే సమయంలోనే.. దేశం కాని దేశానికి చెందినవారు భారతీయ సనాతన సంప్రదాయాల వైపు ఆసక్తి కనబర్చడం కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో తన మరణానంతర అంతిమ సంస్కారాలతో కొత్త చర్చకు కారణమయ్యాడు రష్యా-ఉక్రెయిన్ వార్లో అసువులు బాసిన ఓ రష్యన్ సైనికుడు. యుద్ధభూమి నుంచి ఆధ్యాత్మిక క్షేత్రానికి ఆ సైనికుడి అంతిమ ప్రయాణమే ఈ కథనం!**



సెర్గీ గ్రాబ్లెవ్ రష్యన్ సైనికుడు. తన జీవితంలో సుమారు 18 ఏళ్ల నుంచి రష్యా దేశం నుంచి గోకర్ణకు తప్పకుండా వచ్చే భక్తుడు. మహాబళేశ్వరంలో దర్శనమనంతరం వారణాసిని సందర్శించేవాడు. అక్కడ దీక్షాపరుడై నియమ నిష్ఠలతో సత్యాన్ని అన్వేషిస్తూ వస్తున్న సెర్గీ గ్రాబ్లెవ్.. అక్కడ కనిపించే వైరాగ్యం, విముక్తి కోసం నిరీక్షించేవారు, మోక్షం కోసం తపన పడేవారిని చూసి పూర్తిగా హైందవ ఆధ్యాత్మిక మార్గంవైపు మళ్లాడు. తను తీరికలేని సైనిక వృత్తిలో ఉంటూ.. ఆధునిక ప్రపంచంలో ఓవైపు సాంకేతికతతో కూడిన యుద్ధ రంగంలోని వీరుడై యుండి.. ఆధ్యాత్మిక మార్గాన్ని అమితంగా ఆచరించే అరుదైన వ్యక్తుల్లో ఒకడిగా తత్వజ్ఞానంపై ఒక దృక్కోణాన్ని కల్గి ఉండటం సెర్గీ గ్రాబ్లెవ్లో కనిపించే ఓ వైరుధ్యం.

ఈమధ్య రష్యా- ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం కావచ్చు.. గత యుద్ధాల్లో పాల్గొన్న అనుభవం కావచ్చు.. సెర్గీ గ్రాబ్లెవ్ను శాంతి వైపు, భవబంధాల నుంచి విముక్తి వైపు, జనన, మరణాల నుంచి విదుదల కావాలన్న యోచనతో హైందవ ధర్మం వైపు అడుగులేయించొచ్చు బహుశా.

ఎందుకంటే, పుట్టుకతో క్రిస్టియన్ అయిన సెర్గీ గ్రాబ్లెవ్ అంత్యక్రియలు జరిగిన తీరు కూడా ఆయన హైందవ ధర్మాన్ని ఎంతగా అనుసరించేవారనేది చెప్పే విషయం.

అప్పుడు, సెర్గీ గ్రాబ్లెవ్ ఈమధ్య ఎడతెరిపిలేని బాంబుల వర్షంతో యుద్ధభూమిగా మారిన రష్యా, ఉక్రెయిన్ మధ్య వార్లో అసువులు బాసాడు.

ఈ క్రమంలోనే సెర్గీ గ్రాబ్లెవ్ అంత్యక్రియలు గోకర్ణంలో హైందవ సంప్రదాయంలో జరగడం ఓ విశేషం. ఉక్రెయిన్తో యుద్ధంలో చనిపోయిన సెర్గీ గ్రాబ్లెవ్ మృతదేహానికి దేశాల సరిహద్దులు దాటి కర్నాటక గోకర్ణం అరేబియా సముద్ర తీరప్రాంతంలో అంత్యక్రియలు జరిగిన తీరు చూస్తుంటే.. తను ఎంతగా హైందవ ధర్మం వైపు ఆకర్షితుడయ్యాడో చెప్పే కథ ఇది. సుమారు రెండు దశాబ్దాలుగా హైందవ ధర్మాన్ని ఆచరిస్తున్న సెర్గీ గ్రాబ్లెవ్ ఆఖరి ప్రయాణాన్ని ఆయన కోరిక మేరకు గోకర్ణంలో అత్యంత నిష్ఠగా హైందవ ఆచారంలో నిర్వహించారు.

గ్రాబ్లెవ్ కుటుంబం భారత్కు రాలేదుగానీ.. ఆయన అంతిమ సంస్కారాలను వీడియో కాల్ ద్వారా వీక్షించింది. పిండ ప్రదానాలు, నారాయణబలి వంటి ఖర్మకాండలకు పెట్టింది పేరైన మహాబళేశ్వర్లో ఆయన ఆత్మకు విదుదల లభించింది. ఒక వీర సైనికుడు అసువులు బాసినప్పుడు సాధారణంగా జెండాలు, తుపాకుల మోతలతో జరగాల్సిన అంతిమ సంస్కారానికి భిన్నంగా.. గ్రాబ్లెవ్ అంత్యక్రియలు జరగడం విశేషంగా కనిపించిన దృశ్యం.

సాధారణంగా క్రైస్తవ మతంలో అంతిమ సంస్కారంలో భాగంగా ఖననం చేయడం.. వారిని ఏడాదికోసారి జ్ఞప్తికి తెచ్చుకుంటూ వారికి నివాళు లర్పించే కార్యక్రమాలను చూస్తాం. కానీ, తన క్రైస్తవ సంప్రదాయానికి భిన్నంగా విముక్తి, మోక్షానికి మార్గాలుగా విశ్వసించే హైందవ ఆచారంలో అంత్యక్రియలు నిర్వహించడం విశేషం. పితృశాపాలతో పాటు, వివిధరకాల పాపాలకు విముక్తిగా చేసే నారాయణ బలి కార్యక్రమాన్ని కూడా గ్రాబ్లెవ్ అంతిమ సంస్కార సందర్భంగా నిర్వహించడంతో ఈ రష్యా సైనికుడి అంతిమ ప్రయాణం చర్చనీయాంశమైంది.

**యుద్ధం నుంచి మోక్షం వరకు: గ్రాబ్లెవ్ వైరుధ్య ప్రయాణం!**

అకాల, అసహజ మరణాలకు ప్రాయశ్చిత్తం కోసం ఉద్దేశించిందే నారాయణ బలి. కోటి తీర్థంగా పేరుగాంచిన మహాబళేశ్వర్ నారాయణబలికి అత్యంత ప్రముఖమైన క్షేత్రంగా చెబుతుంటారు. శివుడు విష్ణువుకు బలి అర్పించిన ప్రదేశంగా ప్రతీతి. అరేబియా సంద్రపు అలల ఒడ్డున టెంపుల్ టౌన్గా పిలువబడే గోకర్ణం ప్రధానాలయం ఈ కోటి తీర్థానికి సుమారు 200 మీటర్ల దూరంలో కాలినడకన వెళ్లి వచ్చేటట్టుగా ఉంటుంది.

**అసలు నారాయణ బలి ఎలా చేస్తారు..?**

కోటి తీర్థంలో మునిగి వచ్చి నారాయణ బలి కార్యక్రమం చేయడం గోకర్ణంలో ఆనవాయితీ. చాలామంది బ్రాహ్మలు ఒక్కరోజులోనే ఈ నారాయణబలిని పూర్తి చేసేవారుంటారు. మరికొందరు రెండు రోజుల పాటు నిర్వహిస్తారు. నారాయణ బలి సంకల్ప, వినాయక పూజ, కలశ స్థాపన, ప్రేతావాహన, బ్రహ్మ, విష్ణు, యమ, రుద్ర, సవిత్ర గాయత్రీ మంత్రం, దశ పిండ ప్రదానం, పంచక శ్రద్ధ, నారాయణ బలిహోమం, తిలహోమం, పూర్ణాహుతి, విసర్జన, ప్రక్షాళనానంతరం ప్రసాద వితరణ జరుగుతుంది. సాధారణంగా పితృపక్షాల్లో, అమావాస్య రోజున ఎక్కువ మంది ఈ నారాయణ బలి కార్యక్రమాన్ని చేసుకోవడానికి మహాబళేశ్వర్ వెళ్తుంటారు.

అలాంటి నారాయణబలి హోమ కార్యక్రమాన్ని రష్యన్ సైనికుడైన సెర్గీ గ్రాబ్లెవ్కు నిర్వహించడం వెనుక ఆయన నమ్మిన ఆచార సిద్ధాంతాలకు ఆయన మరణానంతరం ఇచ్చిన ప్రాధాన్యతగా భావించాల్సి ఉంటుంది.

మోక్షానికి మార్గంగా మహాబలేశ్వర్ను చెప్పు కుంటారు. 4వ శతాబ్దంలో కదంబ రాజవంశం నిర్మించిన గోకర్ణ ఆలయంలో ఆ విభూదిదారుణ్ని అహంకారాన్ని, ఆత్మలను విముక్తి చేసేవాడిగా కొలుస్తుంటారు భక్తులు. అందుకే, గోకర్ణం అరేబియా ఒడ్డున రిసార్ట్తో ఓ పర్యాటక ప్రాంతంగానే కాకుండా.. ఆ పరమశివుడు ఆత్మలింగం కొలువైన ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోంది.

సరిహద్దులు దాటిన భక్తి గ్రాబ్లెవ్ను ఒక పురాతన సంప్రదాయం వైపు మళ్లించింది. తాను విశ్వసించే విశ్రాంతి స్థలంలో తన జన్మ విముక్తికి చివరి ప్రయాణ వేదికైంది.

గ్రాబ్లెవ్ కథ కేవలం ఒక సైనికుడికి హైందవ ఆచారంలో నిర్వహించిన అంత్యక్రియల కథగానే చూడటానికి పరిమితం చేయలేం. వివిధ అంశాలను వివిధ జాతులు, వివిధ దేశాల ప్రజలు భిన్నపార్శ్వాల్లో చూస్తున్నదానికి ప్రతిబింబంగా కూడా చెప్పుకోవచ్చు. ప్రస్తుత కాలంలో ఆధ్యాత్మిక విషయాలను సవాల్ చేస్తూ శాస్త్రీయమైన చర్చలు ఒకవైపు బలంగా, తార్కికంగా జరుగుతున్న వేళ.. మరోవైపు భారతదేశ సరిహద్దులను దాటి హిందూధర్మాన్ని ఆచరించేవారి సంఖ్యా అంతకంతకూ కనిపిస్తోంది. బాలి నుంచి మొదలుకుంటే బ్రెజిల్ వరకు.. రష్యా నుంచి ప్రారంభిస్తే కాలిఫోర్నియా వరకు ఆధునిక జీవన శైలిపై స్పష్టమైన అవగాహనతో ఉన్నవారే.. హైందవ ధర్మంలోని ఆధ్యాత్మికతవైపు అడుగులేయడం.. జననం నుంచి మరణం వరకూ ఇక్కడి ఆచారాలను పాటించాలనుకోవడమూ సమాజ దృక్కోణంలో కనిపించే వైరుధ్యం.

రష్యా, ఉక్రెయిన్ యుద్ధభూమి నుంచి మహాబళేశ్వర్ ఆలయం వరకూ జరిగిన సెర్గీ గ్రాబ్లెవ్ అంతిమ ప్రయాణం మాత్రం మోక్షానికి పాస్ పోర్ట్ అక్కర్లేదని చెప్పే ఓ భిన్న కథనం.

- బాతాఖానీ సౌజన్యంతో..


BOOK NOW
SERENE WOODS
మా ప్రత్యేకతలు
2వేల మంది ఒకేసారి భోజనం చేసేవిధంగా డైనింగ్ హాల్
అతి పెద్ద కల్యాణ వేదిక
అతి పెద్ద స్విమ్మింగ్ పూల్
బాక్స్ క్రికెట్
ఎగ్జిక్యూటివ్ అండ్ సూట్ రూమ్స్
హైజినిక్ కిచెన్
హైజినిక్ ఫుడ్ అవైలబుల్
అతి పెద్ద బ్లాంకెట్ హాల్
కిట్టీ, బర్త్‌డే పార్టీలకు ప్రత్యేకమైన సౌకర్యం
ప్రత్యేకమైన ప్రీమియం
మినీ థియేటర్
శ్రీకాకుళం నగరానికి 5 కిలోమీటర్ల దూరంలో..
అధునాతన హంగులతో అందరికీ అందుబాటు ధరల్లో
SERENE WOODS
SERENE WOODS CONVENTIONS
ఉదయ్‌కిరణ్: 91009 34455, 91600 93335
కింతలిమిల్లు జంక్షన్ దగ్గర

# నా భార్యకు మంగళసూత్రం కావాలి

**నా భార్యకు మంగళ సూత్రం కావాలి బాబూ అంటూ తన దగ్గర ఉన్న 1120 రూపాయలను బల్ల మీద బోర్లించాడు 93 ఏళ్ల వృద్ధుడు.. అప్పుడు జ్యువలరీ షాపు యజమాని ఏం చేశాడు? హృదయాలను పిండేసే వాస్తవ సంఘటన..!**







మహారాష్ట్రలోని ఛత్రపతి శంబాజీనగర్‌లో 93 ఏళ్ల వృద్ధుడు తన భార్య శాంతాబాయితో కలిసి జ్యువలరీ షాపుకు వెళ్లారు. వీరి ఆహార్యం చూసిన షాపు కుర్రాడు గుమ్మంలోనే ఆపి ఏం కావాలి? అని అడిగాడు. దానికి ఆ వృద్ధుడు ముసిముసి నవ్వులు నవ్వుతూ భార్య వైపు ప్రేమగా చూస్తూ 'నా పెళ్ళానికి మంగళ సూత్రం కావాలి బాబూ' అన్నాడు.

కానీ ఆ కుర్రాడు మాత్రం వీళ్ళ వాలకం చూసి చిరాకుతో 'బంగారం లేదు ఏం లేదు పొద్దున్నే బోణీ బేరం.. డబ్బులు పెట్టుకుని కొనుక్కునే ముఖాలేనా? వెళ్ళండి ఇక్కడ నుంచి.." అని విసుక్కున్నాడు.

దాంతో వృద్ధుడు ఆత్మాభిమానంతో 'ఊరికినే ఇవ్వక్కర్లేదు బాబూ.. ఇవిగో డబ్బులు' అంటూ తన చేతి సంచిలో చిల్లరతో కలిపి ఉన్న 1120 రూపాయలు బల్ల మీద బోర్లించాడు. ఆ చిల్లర చూసిన కుర్రాడికి కోపం నషాళానికి అంటింది.. ముందు ఇక్కడ నుంచి వెళ్తారా? లేదా? అని గట్టిగా కేకలు వేశాడు.

ఈ అరుపులకు లోపలి నుంచి గోల్డ్ షాప్ యజమాని బయటికి వచ్చి విషయం ఏంటని ఆ వృద్ధ దంపతులను అడిగాడు.

అప్పుడు ఆ వృద్ధుడు 'బాబూ.. పెళ్ళైన ఇన్నేళ్లలో కూడా నా భార్యకు మిల్లీగ్రాము బంగారం కూడా కొనలేదు.. అదీ నన్ను బంగారం కొనమని ఎప్పుడూ అడగ లేదు.. మెడలో ఆ పసుపు తాడు మినహా దానికి నేను ఇచ్చింది ఏమీ లేదు.. నాకు దేవుడి పిలుపు ఎప్పుడొస్తుందో చెప్పలేము.. అందుకే నేను ఉండగానే దాని మెడలో బంగారు మంగళసూత్రం చూడాలని కోరిక.. అది కూడా ఉరికే ఇవ్వవద్దు.. ఇదిగో ఈ డబ్బులు తీసుకుని ఎంత వస్తే అంత ఇవ్వండి' అని టేబుల్ మీద ఉన్న 1120 రూపాయలను చూపిస్తూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

ఇన్నేళ్ల కాపురంలో భార్య మీద 93 ఏళ్ల ఆ వృద్ధుడి ప్రేమకు గోల్డ్ షాప్ ఓనర్ కళ్ళు చెమర్చాయి.. వెంటనే గుమాస్తా కు చెప్పి మంగళ సూత్రాలు తెప్పించి 1120 రూపాయలతో పాటు బంగారం కూడా వృద్ధుడి చేతిలో పెట్టాడు.

ఉచితంగా తీసుకోవడానికి ఆ వృద్ధ దంపతులకు ఆత్మాభిమానం అడ్డు వచ్చింది.. డబ్బులు తిరిగి షాపు యజమాని చేతిలో పెడుతూ 'ఈ డబ్బులు ఉంచు బాబూ' అని బలవంత పెట్టబోయారు..

'ఈ బంగారం నేను మీకు ప్రేమతో కానుకగా ఇస్తున్నాను.. మీరు అడుగుతున్నారు కాబట్టి ఇందులో 20 రూపాయలు మాత్రమే తీసుకుంటా' అని 20 రూపాయలు తీసుకుని మిగిలిన డబ్బులూ.. బంగారం ఆ వృద్ధుడి చేతిలో పెట్టాడు.

మంగళ సూత్రం చేతిలోకి తీసుకుని ప్రేమగా భార్య వంక చూశాడు ఆ వృద్ధుడు. అప్పటికే శాంతాబాయి సిగ్గుల మాలచ్చిమి అయిపోయింది!

ఈ తతంగం మొత్తం షాపు కుర్రాళ్ళు వీడియో తీసి సోషల్ మీడియాలో పెడితే గంటల్లోనే 3 కోట్ల వ్యూస్‌తో వైరల్ అయ్యింది. అవును ఆ వృద్ధ దంపతుల ప్రేమకు ఎవరు మాత్రం ఫిదా అవకుండా ఉండగలరు!!

- పరేష్ తుర్లపాటి

## - టూవీలర్లన్నింటికీ -
# ఇక ఏబీఎస్
**.....వచ్చే ఏడాది నుంచి తప్పనిసరి.....**



**న్యూఢిల్లీ:** ద్విచక్ర వాహన ప్రమాదాలు తగ్గించేందుకు కేంద్రం ఓ కీలక నిర్ణయం తీసుకొనే దిశగా అడుగులు వేస్తోంది. దేశంలో అమ్ముడయ్యే టూవీలర్లన్నింటికీ యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్)ను తప్పనిసరి చేయనుంది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురాలని కేంద్రం భావిస్తోంది. ఈమేరకు త్వరలోనే కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీచేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

ప్రస్తుతం దేశీయంగా అమ్ముడవుతున్న 150 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం కలిగిన టూవీలర్లకే ఏబీఎస్ తప్పనిసరి అన్న నిబంధన అమలవుతోంది. ఇకపై ఎంట్రీ లెవల్ మోడళ్లు సహా అన్ని టూవీలర్లకూ దీన్ని తప్పనిసరి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలో మొత్తం ఎంట్రీ లెవల్ మోడళ్లే దాదాపు 75 శాతం వరకు ఉన్నాయి. 2022లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20 శాతం వరకు టూవీలర్ల కారణంగా జరుగుతున్నాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

### పెరగనున్న ధరలు

ఏబీఎస్ నిబంధనను తప్పనిసరి చేస్తే ఆ మేర టూవీలర్ ధరలు పెరగనున్నాయి. ఏబీఎస్‌ను అమర్చడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఆ భారాన్ని కంపెనీలు వినియోగదారులకే బదిలీ చేస్తాయి. దీనివల్ల ఎంట్రీ లెవల్ టూవీలర్ మోడళ్ల ధరలు రూ. 2500 నుంచి రూ.5వేల వరకు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ప్రమాదాలను అడ్డుకోవడంలో ఏబీఎస్ ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు.

### ఏబీఎస్ అంటే?

ఏబీఎస్ అంటే యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్. ఇది వాహనాల్లో ఉపయోగించే ఒక భద్రతా వ్యవస్థ. సడన్ బ్రేకింగ్ సమయంలో చక్రాలు లాక్ అవ్వకుండా నిరోధిస్తుంది. దీనివల్ల డ్రైవర్‌కు వాహనం మీద నియంత్రణ ఉంటుంది. వాహనం స్కిడ్ కాకుండా నివారిస్తుంది.

---

## కంటతడి మరచిపోయామా?
# పాడిబారిపోయామా?

**గు**రువారం మిట్ట మధ్యాహ్నం, కడుపు నిండుగా మనుషుల్నీ, వాళ్ల జీవితాలనీ కలల్నీ కర్తవ్యాలనీ మోసుకుని ఎగరబోయిన లోహవిహంగం కుప్పకూలిపోయింది. మండిపోయింది. దగ్ధ మాంసశకలాలుగా పిగిలిపోయింది. పైకి ఎగతన్నుకోలేకపోతున్నాను, శక్తి చాలడంలేదు, నేలరాలిపోతున్నాను అన్న సందేశాన్ని వదిలి నిస్సహాయంగా విస్ఫోటించింది. చావుల మీద యుద్ధానికి చదువులు పదునుపెడుతున్న, అన్నం కంచాల ముందు కూర్చున్న, రేపటి డాక్టర్ల మీద మిన్నులా విరిగిపడింది. అమాయకపు నిరీక్షణల మీద క్షిపణి దాడి, తలకొట్టుకుని గుండె బాదుకుని ఎన్నెన్ని ఎడతెగని ఆప్త ఆర్తనాదాలు! ఎందరి కడుపుకోత, ఎన్ని కన్నీళ్ల కుండపోత!! ఒక ప్రమాదం.

ఎక్కడో ఏ కొంచెమో మనుషులదో వ్యవస్థలతో యంత్రాలదో అలక్ష్యమో ఏమరుపాటో ఉండవచ్చు, లేకపోనూ వచ్చు. సంభావ్యతలన్నిటినీ నివారించలేని మానవ అశక్తత ఇంకా మిగిలే ఉండవచ్చు. ఎన్నడూ స్ఫురణకు రాని 'విధి' ఉన్నట్టుండి రంగం మీదకు రావచ్చు. అతీతశక్తి ఉన్నదని అనిపించే సమయం ఇదే కావచ్చు. వివరించలేని, అర్థం కాని విషాదం కమ్ముకున్నప్పుడు, మనుషులు బేలలు అవుతారు. ఆ కొద్ది కాలం, మనుషుల మధ్య అగాధాలూ వ్యత్యాసాలూ రద్దయినట్టు కనిపించి మానవీయ సన్నివేశం ఆవిష్కృతం అవుతుంది. అందుకే, అహ్మదాబాద్ ప్రమాదం తరువాత ఎట్లా స్పందించాలో మనకు తెలియడం లేదు. కారకులు కనిపించడం లేదు కాబట్టి, ద్వేషం గురిపెట్టడానికీ కుదరడం లేదు. నలభై ఏళ్ల కిందట 'కనిష్క' విమానం అట్లాంటిక్ మీద మాయమైనప్పుడు, ప్రాణాలు కోల్పోయినవారి గురించి కాక, వారి కోసం విమానాశ్రయాలలో ఎదురు చూస్తున్న, దుర్ఘటన వార్త తెలిసి తమ వారి క్షేమం కోసం ఆచూకీ కోసం అల్లాడిపోతున్న బంధుమిత్రుల భావోద్వేగాలను ఒక 'హ్యూమన్ ఇంటరెస్టింగ్' కథనంగా రాసినట్టు గుర్తు. అప్పటికింకా మానవీయ కథనాలు ఇప్పటి యాంత్రికతను, కృత్రిమతను సంతరించుకోలేదు.

జీవితం బుద్బుదం అని మరోసారి గుర్తుచేసింది ఈ ప్రమాదం అన్నారొక పారిశ్రామిక వేత్త. అస్తిత్వం క్షణికతను చెప్పే సందర్భమే ఇది. అలాగని, మనుషులు ఆ ప్రమాదవైరాగ్యంలోనే ఉండిపోరు. దిగ్భ్రాంతి నుంచి, దుఃఖం నుంచి కోలుకోవడానికి ఏదో ఒక ఆలంబన కావాలి. కానీ, ఈ విచార మానవీయఘట్టంలో ఓదార్పునో, సహానుభూతినో అందించగల నైపుణ్యం మీడియాకు, మీడియా ద్వారా ప్రజల భావాలతో సంభాషించే అధికారసమాజానికి తగ్గిపోయింది. కొన్ని గంటలు కూడా ఆ షాక్‌లో, విషాదంలో ఉండకముందే, ఈ ప్రమాదం వెనుక కుట్ర ఉందా, పేలుడు జరిగిందా వంటి ప్రశ్నలు మొదలయ్యాయి. స్టోరీలు నడవడానికి ఏదో ఒక ప్రశ్న నడుస్తూ ఉండాలి. సంక్షోభాల కాలం కాబట్టి, కుట్రలను కూడా కొట్టిపారేయకూడదేమో? ఆ సంగతి విచారణలకు వదిలిపెట్టవచ్చు కదా, వెంటనే వాతావరణంలో ఒక విషపుచుక్క వదలడానికి ఎందుకు అంత ఉబలాటం?

ఒకే ఒక్కడు, కూలిన ఆ విమానం నుంచి పెద్ద గాయాలు లేకుండా బయటపడడం అద్భుతమని, దైవమహిమ అని ఆధ్యాత్మిక ఆశ్చర్యాలు వ్యక్తమయ్యాయి. ఆ స్థితి కూడా ఎక్కువకాలం కథనాలు కొనసాగలేదు. ఆ ఒక్కడే కుట్రదారుడేమో? లేకపోతే, ఎట్లా బయటపడ్డాడు? అన్న శంకలు మొదలు. దేవుడా!? ఈ మనిషికి తన విషమనస్కత నుంచి విముక్తి లేదా? పెహెల్గామ్ హత్యాకాండ జరిగినప్పుడు, ఒక పర్యాటకస్థలంలో, కుటుంబాలతో విహరిద్దామని వచ్చిన సామాన్యులను దుర్మార్గులు పొట్టనబెట్టుకోవడం ప్రతి ఒక్కరినీ కలచివేసింది. భర్త మృతదేహం వద్ద నిస్సహాయంగా ఉన్న యువతి దృశ్యం ఆ నాటి విషాదానికి ఒక ప్రాతినిధ్య చిత్రంగా దేశప్రజల స్మృతిలో నిలిచిపోయింది. 'అయ్యో' అన్న వేదనే తక్షణం దేశప్రజల హృదయంలో కదలాడిన స్పందన. అక్కడి ఘోరకలి సన్నివేశాన్ని వర్ణించిన వారు, అక్కడ స్థానికుల మానవీయ స్పందనలను కూడా ప్రపంచానికి చెప్పారు. టెర్రరిస్టు దాడిలో చనిపోయినవారిలో ఒక స్థానిక కశ్మీరీ ఉన్నాడు. అతను హిందువులను రక్షించే క్రమంలో చనిపోయాడు. అక్కడ జరిగింది ఒక మతం వారిపై మరొక మతం వారు చేసిన దాడి అనే కథనాన్ని (దాడి చేసిన వారి లక్ష్యం ఈ నెరేటివ్‌ను స్థిరపరచడమే) ఆ కశ్మీరీ తన ప్రాణత్యాగంతో అబద్ధంగా మార్చాడు.

ఒక ఘాతుకం గుండెలకు గాయం చేసినప్పుడు,



ప్రతికూల భావనలు కమ్ముకునే మనసులకు ఇటువంటి ఆదరణలు, సహాయాల ఉదంతాలు ఉపశమనం ఇస్తాయి. లోకం మరీ అన్యాయంగా లేదని ఊరట కలిగిస్తాయి. కానీ, మన సమాజం ఎక్కువ సేపు విభజనలోకి జారిపోకుండా ఉగ్గబట్టుకోలేదు. కొంచెం సేపైనా, ఒక సహృదయ స్థితిలో ఉండే శక్తిని కోల్పోతున్నది. ప్రతి ఒక ఘట్టమూ, ప్రతి ఒక్క దశా అనివార్యంగా ప్రతికూలమనస్కతలోకి జారిపోవలసిందే!

గాజాలో ప్రతిరోజూ లెక్కబెట్టి వందమందినో యాభైమందినో అందులోనూ తప్పనిసరిగా పదిరవై మంది పసిపిల్లలను పొట్టనబెట్టుకోకుండా తెల్లారని ఇజ్రాయిల్‌కు మనదేశంలో ఎంతమంది అభిమానులో? యుద్ధబాధితులైన పాలస్తీనా బాలబాలికలను చూస్తే గుండెలు పగిలిపోతాయి. పసిపిల్లలే నాకు శత్రువులు అంటాడు నెతన్యాహూ మంత్రి. ఇరాన్‌లోకి వెళ్లి 'గుస్ గుస్ కే' చంపగల వీరుడని మనం వాళ్ళని పొగుడుతాం. ఏడ్చే శక్తి ఎట్లాగూ పోయింది, చలించే శక్తీ పోయింది, మంచీచెడ్డా తెలియని ఒక ఉన్మాద స్థితి మనల్ని క్రమంగా ఆవరిస్తున్నది. పెహెల్గామ్ కల్లోల కశ్మీర్‌లో జరిగింది కాబట్టి, హంతకులు మతం అడిగి మరీ హిందువులనే చంపారని వార్తలు వచ్చాయి కాబట్టి, దుఃఖంతో పాటు సహజంగా ఆగ్రహాలు కూడా కలిగాయి. టెర్రరిస్టుల మీదనే తమ కోపాన్ని పరిమితం చేసుకున్నవారు కొందరయితే, మొత్తంగా ముస్లిం మైనారిటీల మీద తమ క్రోధాన్ని గురిపెట్టిన వారు మరికొందరు. హత్యాకాండ జరిగినచోట పర్యాటకులను రక్షించినవారు, గాయపడినవారికి ఆసరాగా నిలిచినవారు కూడా ముస్లిములే అన్న వాస్తవాన్ని చాలామంది ఖాతరు చేయలేదు. బాధితుల కుటుంబీకులే తాము ఫలానా మతస్థుల మీద కోపంగా లేమని, టెర్రరిస్టులే తమకు హాని చేసినవారని స్వయంగా చెప్పారు. అయినా, దేశంలోని సామాజిక మాధ్యమాలు ద్వేషభాషలో అలరారాయి. చివరకు భర్తను కోల్పోయిన బాధితురాలిని కూడా ట్రోలింగ్‌తో వేధించారు.

పెహెల్‌గామ్ అనంతర చర్యగా జరిగిన 'ఆపరేషన్ సిందూర్' ప్రతినిధిగా దేశానికి సైనికచర్యల పరిణామాలను వివరించిన వాయుసేన అధికారిణి సోఫియా ఖురేషీ కూడా ద్వేషదాడులను ఎదుర్కొన్నారు. పెహెల్గామ్ జరిగిన మరుసటి రోజో, ఆ తరువాతి రోజో, ఒక బెంగాలీ ముస్లిమ్ సైనికుడు కశ్మీర్‌లో టెర్రరిస్టులతో ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. దేశసామరస్య జీవనానికి, సమ్మిశ్రతతకు భరోసా కలిగే అటువంటి వార్తలకు మీడియాలో పెద్దగా చోటు దొరకదు.

పాజిటివ్ సంకేతాలంటే మనకు ఎలర్జీ! పెహెల్గామ్ హత్యాకాండ జరిగినప్పుడు, ఒక పర్యాటకస్థలంలో, కుటుంబాలతో విహరిద్దామని వచ్చిన సామాన్యులను దుర్మార్గులు పొట్టనబెట్టుకోవడం ప్రతి ఒక్కరినీ కలచివేసింది. భర్త మృతదేహం వద్ద నిస్సహాయంగా ఉన్న యువతి దృశ్యం ఆనాటి విషాదానికి ఒక ప్రాతినిధ్య చిత్రంగా దేశప్రజల స్మృతిలో నిలిచిపోయింది.

సహృదయ స్పందనలను క్షీణింపజేసే, నిరుత్సాహపరచే వాతావరణం కమ్ముకున్న సమాజంలో, మనలో కన్నీటి గ్రంథులు అడుగంటిపోతాయి. ఆనందించవలసిన వాటికి ఆనందించలేము. ఎవరో మన భావోద్వేగాలను నియంత్రిస్తున్నట్టు, మూస పోసిన ఆనందాలను, దుఃఖాలను మాత్రమే వ్యక్తం చేయగలుగుతాము. ఆపరేషన్ కగార్ విషయంలో అత్యధికంగా వ్యక్తమవుతున్న స్పందన –నిర్లిప్తత. ఆ తర్వాత స్పందన – మౌనాంగీకారం. ఆ తరువాతి స్థానాలలో వ్యతిరేకత, నిరసన ఉంటాయి. చివరి స్థానంలో అయినా, బలమైన వ్యక్తీకరణగా, ఆపరేషన్‌కు సమర్థన కనిపిస్తోంది.

భారతదేశంలో, సంప్రదాయికంగానూ, రాజ్యాంగపరంగానూ గొప్ప స్థానం ఉందని భావించే ఆదివాసులు పెద్దసంఖ్యలో చనిపోతుంటే, పాలిథిన్ కవర్లలో కళేబరాలు 'నాగరిక' సమాజాన్ని ప్రతిపూటా పలకరిస్తుంటే, అదంతా పెద్ద విషయం కాదనీ, అనివార్యమనీ, ప్రభుత్వం మంచిపనే చేస్తున్నదని ఎట్లా అనుకోగలుగుతున్నారు? ఆరు నెలల్లో 500 మంది కదా? పోనీ, అందులో ఒక వందమంది మావోయిస్టులు అనుకున్నా 400 మంది ఆదివాసులే కదా? కాల్పులు నిజమైనవా, బూటకపువా చర్చ కూడా వద్దు, అంతమంది అతిసారతో చనిపోయినా అసెంబ్లీలు పార్లమెంటులు గగ్గోలు పెడతాయి కదా? ఇక్కడెందుకు కళ్లు మూసుకుపోతున్నాయి? కగార్ వార్తల కింద సోషల్ మీడియాలో కామెంట్లు చూడండి. మనుషులలోని అధోజగత్తు వీరవిహారం కనిపిస్తుంది.

ఏడ్చే శక్తి ఎలాగూ పోయింది, చలించే శక్తీ పోయింది, మంచీచెడ్డా తెలియని ఒక ఉన్మాద స్థితి మనల్ని క్రమంగా ఆవరిస్తున్నది. సహృదయ స్పందనలను క్షీణింపజేసే, నిరుత్సాహపరచే వాతావరణం కమ్ముకున్న సమాజంలో, మనలో కన్నీటి గ్రంథులు అడుగంటిపోతాయి. ఆనందించవలసిన వాటికి ఆనందించలేము. ఎవరో మన భావోద్వేగాలను నియంత్రిస్తున్నట్టు, మూసపోసిన ఆనందాలను, దుఃఖాలను మాత్రమే వ్యక్తంచేయగలుగుతాము.

మనుషులలో అట్టడుగున అయినా ఎంతో కొంత తడి ఉంటుంది, ఒక సంక్షోభస్థితిలో గుండెలు పొడిబారినప్పుడు, ఆ ఆర్ద్రతను పైకి రప్పించగలిగితే, ఆ క్షణం వరకు అయినా నిస్పృహ, తామస, విషభావనల నుంచి విముక్తి దొరుకుతుందనిపిస్తుంది. అలా కాక, నిద్రిస్తున్న చీకట్లను రెచ్చగొట్టే అక్షరాలు, దృశ్యాలు మరింతగా మరింతగా అమానవీయం చేస్తాయి.

– ప్రజాతంత్ర న్యూస్ కోసం..



## విజయవంతమైన మెగా రక్తదాన శిబిరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపనకు 70 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా, బ్యాంకు చైర్మన్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించాయి. ఈ క్రమంలో శ్రీకాకుళం రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం రీజియన్ పరిధిలో జరిగిన కార్యక్రమాల్లో మొత్తం 200 యూనిట్లకు పైగా రక్తాన్ని బ్యాంకు ఉద్యోగులు దానం చేశారు. శ్రీకాకుళం, పలాస, సోంపేట, కంచలి క్లస్టర్లలో రక్తదాన శిబిరాలు నిర్వహించగా, దానిని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్బీఐ మేనేజర్ శ్రీ ఉదయకుమార్ సింగ్, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పింకీ చైతన్య కుమార్, కె. సత్యనారాయణ, జి. రమణ, ఎస్బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ కామ్రేడ్ కిషోర్, స్టాఫ్ యూనియన్ రీజనల్ సెక్రటరీ కామ్రేడ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## యోగాతోనే మనిషి జీవితం శక్తిమంతం

(సత్యంన్యూస్, రాజాం)



విశాఖ బీచ్ రోడ్డు వేదికగా లక్షలమందితో ప్రపంచం రాష్ట్రం వైపు చూసేలా, యోగాంధ్ర-2025 కు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. యోగాంధ్ర దినోత్సవంకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, ప్రపంచరికార్డు సృష్టించేలా సాగరతీరంలో 5లక్షల మందితో యోగాసనాలు చేయించేందుకు రంగం సిద్ధమయ్యిందన్నారు. ఈ యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా తప్పనిసరిగా చేయాలన్నారు. దీనివల్ల శారీరకంగా మానసికంగా ఉంటారన్నారు. యోగా అనేది దివ్య ఔషధం లాంటిదని, యోగా సాధన ద్వారా మనిషి జీవితం శక్తిమంతుడై మానసిక ఉత్తేజం, ఏకాగ్రత పొందుతారన్నారు. మనసును శరీరంలో సమతత్వాన్ని తెచ్చే పురాతన సనాతన విధానం, అందరికి ఇది అనుసరణీయమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు.



శ్రీకాకుళం నియోజకవర్గ నగర పరిధి డేఅండ్ నైట్ జంక్షన్ ట్రెండ్ షోరూమ్ ఎదురుగా సూర్య మణికంఠ డాక్టర్స్‌ప్లాజా హాస్పిటల్‌ను శుక్రవారం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాండ్రంకి శంకర్, అరవల రవీంద్ర తదితరులున్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం



మండలంలోని జగన్నాథపురం గ్రామంలో వికాసిత్ భారత్ సంకల్ప సమావేశం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంపై స్థానిక పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రేళ్ల ఢిల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పరిసల్ల తిరుపతి రావు, అసురి ఉమామహేశ్వరరావు, బూత్ అధ్యక్షుడు ఎసై మోహన్‌లు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, హిరమండలం





ఈనెల 21న జరగబోయే 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవ సందర్భంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా కూటమి ప్రభుత్వం నిర్వ హిస్తున్న "యోగాంధ్ర" కార్యక్రమం ఘనంగా జరగాలని శ్రీ సూర్య నారాయణ స్వామి వారిని దర్శించుకొని, అనంతరం సైకిల్ ర్యాలీతో వస్తున్న ఎంపీ కలిశెట్టికి రణస్థలం మండల హెడ్‌క్వార్టర్‌లో పాత పెట్రోల్ బంక్ వద్ద వెంకటేశ్వర కాలనీ యువత పూలదండలతో సత్కరించడం జరిగింది.

– సత్యంన్యూస్, రణస్థలం

## జూలై 9న అఖిలభారత సమ్మె జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణకై కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు జూలై 9న అఖిల భారత సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళంలో సిఐటియు జిల్లా సమావేశం సిఐటియు కార్యాలయంలో జరిగింది. జూలై 9 అఖిల భారత సమ్మె వాల్ పోస్టర్లు విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 9న సమ్మె సందర్భంగా అన్ని మండల కేంద్రాలలో ప్రదర్శనలు జరుగుతాయని, ఈ ప్రదర్శనలలో కార్మికులు, స్కీం వర్కర్లు పాల్గొవాలని కోరారు. ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం నెలకు రూ.26,000లుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేసారు. దశాబ్దాలు పాటు కార్మిక వర్గం పోరాడి అశేష త్యాగాలతో సాధించుకున్న 44కార్మిక చట్టాలను రద్దు చేసి మోడి నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాలు కోసం 4 లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందని అన్నారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడం కోసం, పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందని అన్నారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్.ఐ.సి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అదానీ,అంబానీలకు దేశ సంపదను దోచి పెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తుందని ప్రజలపై భారాలు వేస్తుందని అన్నారు. జూలై 9న సమ్మె జయప్రదం చేసి కేంద్ర కార్మిక ఐక్యత చాటి చెప్పాలని కోరారు. అంగన్వాడీలకు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎమ్.ఆదినారాయణమూర్తి, అల్లు.సత్యన్నారాయణ, కె.సూరయ్య, ఎన్.వి.రమణ, ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీ నారాయణ, శ్రీకాకుళం నగర కన్వీనర్ ఆర్.ప్రకాశ్‌లు పాల్గొన్నారు.





'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

## యోగాంధ్రపై అవగాహన

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)



"యోగాంధ్ర – 2025" మహోత్సవాల్లో భాగంగా ప్రజల్లో యోగపై అవగాహన పెంచేందుకు ఎమ్మెల్యే కళా వెంకటరావు శుక్రవారం తన స్వగృహంలో యోగాసనాలు వేశారు. అనంతరం మాట్లాడుతూ 21న జరగనున్న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని,ప్రజల్లో యోగపై అవగాహన పెంచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. "యోగ" చేయడం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. యోగా శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా, దినసరి ఒత్తిడిని తగ్గించడంలో యోగా చాలా ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

## తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

(సత్యంన్యూస్, సరుబుజ్జిలి)

ఇటీవల సరుబుజ్జిలి మండలం చిగురువలస గ్రామంలో ఒక కార్పెంటర్ పని చేసుకుని జీవిస్తున్న ఒక నిరుపేద కుటుంబం జరుగుల్ల రాజారావు ఇంటిని కేవలం రాజకీయ కక్షతో టీడీపీ నాయకులు కూలగొట్టారని, దానికి తగిన మూల్యం టీడీపీ నాయకులు చెల్లించుకోక తప్పదని వైకాపా ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ విమర్శించారు. ఈమేరకు శుక్రవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఇప్పుడు ఆ కుటుంబం వారి జీవనాధారం అయిన కర్రపని చేసుకునే సామాన్లతో పాటు రోడ్డు మీదకు వచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయ లేక, పరిపాలన చేతకాక ఇలాంటి అరాచకాలు చేస్తూ పబ్బం గడుపుతుందన్నారు. వీటన్నింటికీ రేపటి రోజున అసలు వడ్డీ కలిపి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. స్థానిక ఎమ్మెల్యేకి ఎంతవరకూ ఇసుక మీద మద్యం మీద దోచుకోవడం దాచుకోవడమే అలవాటుగా మారిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, మాజీ జేసీఎస్ కన్వీనర్ రవికాంత్, మాజీ పీఏసీఎస్ కొవిలాపు శేఖర్, సర్పంచ్ సురవరపు తిరుపతిరావు,వైసీపీ నాయకులు ఎర్రయ్య,మెట్ట నందేసు కెప్టెన్ రామారావు , కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు





ఆమదాలవలస నియోజకవర్గంలో ఆమదాలవలస పట్టణంలో ఉన్న టీడీపీ ఆఫీస్‌లో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస



శ్రీకాకుళం నియోజకవర్గ పరిధి నగరంలో విశాఖ ఏ కాలనీ కార్యాలయంలో రేపు జరగబోవు యోగాంధ్ర కార్యక్రమం పై ప్రత్యేక అధికారి, మున్సిపల్ కమిషనర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం





మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో గల గొంటివీధిలో ఉన్న మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థినీ, విద్యార్థులకు స్కూల్, పుస్తకలు,యూనిఫామ్‌లను 16 డివిజన్ ఇంచార్జి ఎస్వీ రమణ మాదిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్ టీచర్ లక్ష్మి, స్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## వైకాపాకు "కార్యకర్తే కీలకం"

(సత్యంన్యూస్, రణస్థలం)

ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం క్యాంపు కార్యాలయంలో వి.యన్.పురంపంచాయితీ కార్యకర్తలతో "కార్యకర్తే కీలకం" కార్యక్రమంలో భాగంగా మూడవరోజు కార్యకర్తలలో ఎచ్చెర్ల మాజీ శాసన సభ్యులు, సమన్వయకర్త గొర్లె కిరణ్‌కుమార్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే వెన్నుముకన్నారు. పార్టీ ఓటమి చెందిన కూడా కార్యకర్తలలో ఉత్తేజం ఉప్పొంగుతుందన్నారు. ఈ ఉత్సాహ భరితాన్ని ఇలానే కొనసాగించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలు పడుతున్న బాధలు,ఇబ్బందులు చూసి ప్రతీ కార్యకర్తకు అండగా నిలుస్తానని, కార్యకర్తల కోసమే పనిచేస్తానని హామీ ఇచ్చిన విషయాన్ని ప్రతి ఒక్క కార్యకర్త గుర్తుంచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు,అన్యాయాలను ప్రజలకు తెలియపరచాలన్నారు. రానున్నవి ఏ ఎన్నికలైన సరే ధీటుగా ఎదుర్కొని విజయ డంకా మ్రోగించాలన్నారు. ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా తనను సంప్రదించినట్లయితే వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేస్తానని నాయకులు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మింది జనార్దన్ రెడ్డి,నాయకులు లంక సీతం నాయుడు, దుంప అక్కులు,బాసి రమణ,రెడ్డి అప్పల నాయుడు,రెడ్డి వాసుదేవ రావు, జగ్గారోతు సిమ్మి నాయుడు,మింది సూరి రెడ్డి,మింది లక్ష్మణ రెడ్డి,రెడ్డి గోవింద, వనుం ఆదినారాయణ, పెంటిమాని ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.





మండలం కొత్తూరులో 'వెన్నుపోటు' పుస్తక ఆవిష్కరణ శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో మండల వైకాపా మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, ఎంపీపీ సవర సావిత్రమ్మ, చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ ధర్మారావు, ఎంపీటీసీ వి.లక్ష్మీనారాయణ, సర్పంచ్ ప్రతినిధి ఆగతముడి రంజిత్, సర్పంచ్ నాస బాలకృష్ణ మండల ప్రధాన కార్యదర్శులు కృష్ణమోహన్. బి.నగేష్, పోలయ్య, సవర రమేష్, బీసీ సెల్ నాగేశ్వరరావు, రాజులనాయుడు, దూళి అప్పన్న, పకీరు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, కొత్తూరు

## నైతిక విలువలకు ప్రాధాన్యతనిచ్చే వ్యక్తి కొంక్యాన వేణుగోపాల్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నైతిక విలువలు పాత్రికేయ వృత్తి సాంప్రదాయాలకు ప్రాధాన్యతనిచ్చే వ్యక్తుల్లో కొంక్యాన వేణుగోపాల్ ముందు వరసలో ఉంటారని వివిధ సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ జన్మదినం సందర్భంగా నగరంలోని గొంటివీధి నైటెషెల్టర్లో నిరుపేదలకు ఆహార పదార్థాలను అందజేశారు. ఈ సందర్భంగా జేసీఐ సెనేటర్ నటుకుల మోహన్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా పత్రికారంగంలో వివాదరహితుడిగా విలువలకు ప్రాధాన్యతనిచ్చే వ్యక్తిగా వేణుగోపాల్ నిలిచారన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పొన్నాడ రవి మాట్లాడుతూ పత్రికారంగంలోనే కాకుండా వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ వేణుగోపాల్ చురుకైన పాత్ర పోషిస్తున్నారన్నారు. బిహెచ్ఆర్సి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మణిశర్మ మాట్లాడుతూ జర్నలిస్టు సంఘ రాష్ట్ర నేతగానే కాకుండా బిహెచ్ఆర్సిలో తెలుగు రాష్ట్రాల అధ్యక్షులుగా పౌరుల హక్కుల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతతో పని చేసే వ్యక్తిగా కొంక్యాన నిలిచారన్నారు. మీడియా జేఏసీ కన్వీనర్ ఎస్.జోగి నాయుడు మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తిలోను, జర్నలిస్టు సంఘంలోను కళలు, క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ వేణుగోపాల్ అద్భుతమైన పాత్ర పోషిస్తూ వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కొంక్యాన మురళీధర్, శంభుమహంతి రత్నకిషోర్, శివతేజ, జాడ సాయి, గోపి, పక్కి వేణుగోపాల్, బహదూర్ భాషా, ఎస్.విజయ కుమార్, కృష్ణ, మణి, సాయి తదితరులు పాల్గొన్నారు. నగరంలోని విశాఖ-బి కాలనీ యోగా కేంద్రంలో వేణుగోపాల్ జన్మదిన వేడుకలను యోగా కేంద్రం నిర్వాహకులు పాండ్రంకి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కోటబొమ్మాళి మండలం అక్కయ్యవలస యూపీ స్కూల్లో విద్యార్థుల సమక్షంలో వేణుగోపాల్ జన్మదిన వేడుకలు జరగగా పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే వస్తు సామాగ్రి అందిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, బి హెచ్ ఆర్ సి జాతీయ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రభు, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు మణిశర్మ, జిల్లా అధ్యక్షురాలు ఏ.జ్యోతిర్మయి, సహాధ్యక్షురాలు సౌజన్య, యోగా గురువు కల్పన, పాఠశాల హెచ్ఎం గొర్లె మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వేణుగోపాల్ జన్మదినం సందర్భంగా జర్నలిస్టు సంఘాల జిల్లా నేతలు జి. షన్ముఖరావు, డోల అప్పన్న, చింతపల్లి నాగభూషణ్, టెంక శ్రీను, రాధాకుమారి, సీపాన రమేష్, బొచ్చెన లక్ష్మణతో పాటు వివిధ రంగాల ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.



## యోగా, ధ్యానంతో సత్ఫలితాలు


(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)

యోగా, ధ్యానంతో మంచి ఫలితాలు ఉంటాయని యోగా గురువు కల్పన అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ పిలుపు మేరకు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా కార్యక్రమంలో భాగంగా భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (బిహెచ్ఐఆర్) ఆధ్వర్యంలో మండలంలోని అక్కయ్యవలస ఎంపియుపి స్కూల్లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యోగా సాధన ద్వారా ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు చురుకుగా ఉండవచ్చు అన్నారు. బిహెచ్ఎస్ఆర్సి ప్రతినిధులు మాట్లాడుతూ మానవ హక్కుల కోసం బిహెచ్ఐఆర్ పోరాటం చేయడంతో పాటు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ధ్యానం చేయడం ద్వారా చదువుకున్న విషయాలను సులువుగా గుర్తు పెట్టుకోవచ్చునన్నారు. బిహెచ్ఐఆర్సి జాతీయ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రభు, తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మణిశర్మ, జిల్లా అధ్యక్షురాలు అంధవరపు జ్యోతిర్మయి, జిల్లా సహాధ్యక్షురాలు సౌజన్య, పాఠశాల హెచ్ఎం గొర్లె మహేశ్వరరావు మాట్లాడారు.



## యోగాంధ్రకు భారీ ఎత్తున తరలిరండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఈనెల 21న విశాఖలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుల పిలుపు మేరకు నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి భారీ ఎత్తున హాజరు కావాలని నగర టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నంలో భోగాపురం నుండి ఆర్కే బీచ్ వరకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహా "యోగాంధ్ర"కార్యక్రమం అందరూ భారీ ఎత్తున విజయవంతం చేసి గిన్నిస్ బుక్ రికార్డు సాధనలో అండగా నిలవాలని ప్రజానీకాన్ని కోరారు. గత వైసీపీ అక్రమ, అన్యాయపు, అరాచక పాలనను అంతమొందించడానికి అలుపెరగని పోరాటం చేసి రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి అన్ని వర్గాల ప్రజానీకంతో మమేకమై ధైర్యంగా కూటమి ప్రభుత్వ ముందుకు సాగుతుందన్నారు. అనంతరం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన సందర్భంగా మాదారపు ఆమెకు ఆ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

## యోగాతోనే జీవితం ఆనందమయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక కస్తూరిబాయ్ స్కూల్లో శుక్రవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యోగ సైంటిస్ట్ డాక్టర్ బగాది పాపారావు, యోగా గురువు సూర్యారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బగాది పాపారావు మాట్లాడుతూ విద్యార్థినిలకు, ఉపాధ్యాయులకు నేడు ప్రపంచంలో మహిళలు మానసిక ప్రశాంతత, ఆందోళన, ఒత్తిడికి గురవుతున్నారన్నారు. అందుచేతనే మహిళలకు తలనొప్పి, నడుము నొప్పి, నెలసరి సరిగా రాకపోవడం, నెలసరి వచ్చినప్పుడు కడుపులో నొప్పులు రావడం, అలాగే నెలసరి వచ్చినప్పుడు రక్తస్రావం ఎక్కువగా జరగడం జరుగుతుందన్నారు. అందుకే వాటిని ప్రత్యేక ఆసనాలు ద్వారా నివారించవచ్చని తెలియజేశారు. సూర్యారావు మాట్లాడుతూ యోగా సనాల ద్వారా మానసిక శాంతి, ఏకాగ్రత పెంచుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ గాయత్రి, స్కూల్ చైర్పర్సన్ వాసు, విద్యార్థినిలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఉచిత దుస్తుల పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి 100వ పుట్టినరోజు సందర్భంగా శ్రీ సత్యసాయి సేవాసమితి పెద్దమందిరంలో నిర్వహిస్తున్న ఉచిత ట్యూషన్ సెంటర్ పిల్లలకు నూతన దుస్తులను, వరం చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అందవరపు ప్రసాద్, రిమ్స్ అన్నపూర్ణ ట్రస్ట్ అధ్యక్షులు గంగుల రమణ బాబు, జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు సూర రామచంద్ర రావు గారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి సేవా సంస్థలు సమాజానికి అందిస్తున్న అనేక సేవలను కొనియాడారు. విద్యార్థులలో మానవతా విలువలు నింపేందుకు ఉచిత బాలవికాస్, ఉచిత ట్యూషన్ సెంటర్ నిర్వహించుట, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా కుట్టు శిక్షణ కేంద్రాలు గ్రామాలలో ఏర్పాటుచేసి నిరుపేద గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా సేవా సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్మెంట్ కన్వీనర్ కంబ మురళీకృష్ణ, శేఖర్, కృష్ణ, షణ్ముఖ, మహిళా సేవాదళ్ పాల్గొన్నారు



## ఏరువాక పౌర్ణమిలో ఎమ్మెల్యే శంకర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

2025-26 ఖరీఫ్ సీజన్కి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ వారు ఏరువాక పౌర్ణమి తరువాత రైతులకు అతి ముఖ్యమైన కార్యక్రమం విత్తనాలు నాటడంలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళం రూరల్ మండలం ఒప్పంగి గ్రామంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని రైతులందరికీ రాయితీపై వరి విత్తనాలు, వ్యవసాయ పరికరాలు పంపిణీ 50% సబ్సిడీపై పశువుల దాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



## జిల్లా కేంద్రంలో రెవెన్యూ డే వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన జూన్ నెల 20 వ తారీఖున " రెవెన్యూ డే " సందర్భంగా ఈరోజు శ్రీకాకుళంలోని రెవెన్యూ గెస్టు హౌస్లో జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం అధ్యక్షులు కె. శ్రీరాములు ఆధ్వర్యంలో జెండావందనం నిర్వహించారు. అనంతరం రెవెన్యూ శాఖ ఔన్నత్యం రెవెన్యూ శాఖ పుట్టుక రెవెన్యూ శాఖ విధులు రెవెన్యూశాఖ ప్రజలతో మమేకమై నిర్వహించాల్సిన ప్రభుత్వ కార్యక్రమాల గురించి పెద్దలు మాట్లాడారు. అదే విధంగా రెవెన్యూ సర్వీసుల సంఘం తరపున పెద్దలు రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘ కార్యదర్శి డి.చంద్రశేఖర్, ఎం.వి.సూర్యనారాయణ, ఎం.కాళీప్రసాద్, ఏపీజేఏసి అమరావతి మహిళా విభాగం అధ్యక్షురాలు కె. ప్రవల్లిక ప్రియ, పి. శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్. రాజు, ట్రెజరర్ మురళీధర్ నాయక్, సోని కిరణ్, జి కె శ్రీనివాసరావు, ప్రకాశరావు, శాస్త్రి, రాంజీ, డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జి.వెంకటప్పారావు, అప్పలనాయుడు, రామారావు, త్రినాథ, ప్రసాదు తదితరులు పెద్ద ఎత్తున రెవెన్యూ సంఘ సభ్యులు మరియు రెవెన్యూ ఉద్యోగుల పాల్గొని రెవెన్యూడే వేడుకను అత్యంత వేడుకగా నిర్వహించారు.



## యోగ జీవన విధానంలో అంతర్భాగం కావాలి



(సత్యంన్యూస్, పాతపట్నం)

పాతపట్నం నియోజకవర్గం శ్రీశ్రీ నీలమణిదుర్గ అమ్మవారు ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ప్రజా ఆరోగ్యమే ప్రథమ లక్ష్యంగా ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు 21వ తేదీన విశాఖపట్నంలో జరుగునున్న యోగ దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే

(సత్యంన్యూస్, టెక్కలి)

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా "రెవెన్యూ డే" నిర్వహించారు. తహశీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో మండల టీడీపీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రెవెన్యూ సేవలను గుర్తించి రెవిన్యూడే జరుపుకోవటం చాలా మంచి కార్యక్రమమన్నారు. రెవెన్యూ సేవలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని కొనియాడారు. కార్యక్రమంలో మామిడి రాము, కోళ్ల లవకుమార్, ప్రఫుల్ల పరిడ, నాయకులు, కార్యకర్తలు మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీకాంత్ బృందానికి ఘన సత్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జపాన్లో జరుగుతున్న వరల్డ్ ఎక్స్పో-2025 వేడుకలలో ఇటీవల మన జిల్లా నుండి నగరానికి చెందిన నృత్య గురువు రఘుపాత్రుని శ్రీకాంత్ 6మంది శిష్య బృందం మన రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించి అక్కడ అద్భుతమైన కూచిపూడి, జానపదం, ఫ్యూజన్ నృత్య ప్రదర్శనలతో ఆహుతులను అలరించి అందరి మన్ననలు పొంది స్వదేశానికి విచ్చేసిన విషయం విదితమే. ఈ బృందంను ఆంధ్రప్రదేశ్ ఏపీఈడీబీ విభాగం ఎంపిక చేసి జపాన్ తీసుకొని వెళ్ళారు. అక్కడ అద్భుతమైన నృత్య ప్రదర్శనలు చేసి మన రాష్ట్రానికి గొప్ప పేరు ప్రతిష్టలు తీసుకొచ్చినందుకు ఏపీఈడీబీ సంస్థ సీఈఓ సాయికాంత్ వర్మ గురువారం శ్రీకాంత్, వారి బృందాన్ని మంగళగిరిలో ఉన్న ఏపీఈడీబీ కార్యాలయానికి పిలిచి ఘనంగా సత్కరించారు. ఈ బృందం చేసిన నృత్య ప్రదర్శనలు మంచి పేరు ప్రతిష్టలే కాకుండా భారతదేశం నుండి పాల్గొన్న అన్నిరాష్ట్రాల కన్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మిక్కిలి గౌరవం, అభినందనలు దక్కాయని సాయికాంత్ వర్మ కొనియాడారు. శ్రీకాంత్తో పాటు ఈ బృందంలో రామ కౌండిన్య, నేహా, వర్షిత, లలిత, చాందిని, నేహా థామస్లను సత్కరించారు.



## సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 21న నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవ సందర్భంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న "యోగాంధ్ర కార్యక్రమం" ఘనంగా జరగాలని కోరుతూ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గురువారం సైకిల్ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుల ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. యోగా ప్రతీ ఒక్కరి జీవితాల్లో ఒక భాగం కావాలన్నారు. యోగ చేయటం వలన ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతీ ఒక్కరు యోగాని తమ జీవితాల్లో ఒక భాగంగా మలుచుకోవాలని కోరారు. ప్రపంచ రికార్డు నమోద చేసే దిశగా సుమారు 5లక్షల నుండి 7లక్షలు జనసమూహంతో, 2కోట్లుకు పైగా యోగాంధ్ర సభ్యత్వ నమోదుతో ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి ప్రపంచ నలుమూలలకు వ్యాప్తి చెందేలా కార్యక్రమం జరగనుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితర సభ్యులు పాల్గొన్నారు.



# వచ్చే నెల ఆరు నుంచి హరికథా నవరత్నాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విఖ్యాత సాంస్కృతిక సంస్థ శ్రీ సుమిత్ర కళా సమితి నేతృత్వాన వచ్చే నెల ఆరు నుంచి హరికథా నవరత్నాల పేరిట ప్రత్యేక కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. తమ సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి పులఖండం శ్రీనివాసరావు సంస్మరణార్థం చేపట్టనున్న ఈ కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ కోరారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో సంస్థ ప్రతినిధులు శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదిరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి పలువురు దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారని, వారికి కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. భారతీయ కళలకు పూర్వ ప్రాభవం ఇచ్చే విధంగా తమసంస్థ ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపట్టిందని, ఆ ఒరవడిలో, ఆ..నడవడిలో హరికళా నవరత్నాలు పేరిట చేపట్టే ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నామన్నారు. తొలి రోజు ప్రదర్శనలో భాగంగా సుందరకాండను తిరువళ్లూరి దివ్య శివ భాగవతారిణి వినిపించనున్నారని తెలిపారు. ఈ తొమ్మిది రోజుల కార్యక్రమాలకు కొన్న చిన్నారావు, చిన్నమ్మడు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కొన్న వేంకటేశ్వరరావు ఆర్థిక సహకారం అందించనున్నారని వెల్లడించారు. కార్యక్రమంల శ్రీసుమిత్ర కళా సమితి ప్రధాన కార్యదర్శి గుత్తు చిన్నారావు, కోశాధికారి నక్క శంకర్రావు, ఉపాధ్యక్షులు మండవల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, కొంక్యాన మురళీధర్, వీవీఆర్.మూర్తి, ఎం.రాజు, ఎం.వరలక్ష్మి, పూజ, ఉషారాణి, రాజు, వెంకట్, జ్యోతి, కర్రి అశోక్ పాల్గొన్నారు.



## బాషోపాధ్యాయుల సమస్యలు తీర్చండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న భాషోపాధ్యాయుల సమస్యలను తీర్చాలని రాష్ట్ర బాషోపాధ్యాయ సంస్థ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షుడు పిసిని వసంతరావు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజును కోరారు. ఈ మేరకు జిల్లాకు విచ్చేసిన ఆయన్ను కలసి వినతిపత్రాన్ని అందించారు. విద్యాశాఖ వైఖరి కారణంగా తలెత్తిన సమస్యలను ఏకరువు పెట్టారు. రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని పునరుద్దరించాలని, తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యమం లేకపోవడం విచారకరమని చెప్పారు. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి డిఈఓ పూల్ భాషా పండితులకు తక్షణమే పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుల పోస్టులను పునరుద్ధరించి మాన్యువల్ బదిలీ కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషా బోధకులు లేని కారణంగా ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా క్లస్టర్ పాఠశాలల్లో క్లస్టర్ సహాయకులుగా పనిచేస్తున్న వారికి తక్షణమే ప్రాథమికోన్నత పాఠశాలలకు కేటాయించాలని కోరారు.



## అనపర్తి ఎమ్మెల్యేను కలిసిన పాండ్రంకి, అంధవరపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల పర్యటనకు వచ్చిన అనపర్తి ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావును శ్రీకాకుళం నగర పాలక సంస్థ మాజీ మున్సిపల్ కౌన్సిలర్, రాష్ట్ర తూర్పుకాపు సాధికారిక కమిటీ కన్వీనర్ పాండ్రంకి శంకర్, టీడీపీ సీనియర్ నాయకులు, ప్రముఖ పారిశ్రామిక వేత్త అంధవరపు ప్రసాద్, సాయిరెడ్డిలు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. విజనరీ లీడర్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్కళ్యాణ్, ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో విశాఖపట్నంలో శనివారం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం కావాలని వీరు ఆకాంక్షించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరు కానున్న నేపథ్యంలో జాతీయ అంతర్జాతీయస్థాయిలో పెద్దఎత్తున విశాఖ యోగాంధ్ర విజయవంతమై చరిత్రలో నిలిచిపోయే రీతిలో దిగ్విజయం కావాలన్నారు. గిన్నీస్ రికార్డ్ నమోదు కావాలని వారు కోరారు. ఎమ్మెల్యే శంకర్ సారథ్యంలో విశాఖపట్నం యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేసేలా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపడుతున్నారని వారు అనపర్తి ఎమ్మెల్యేకు వివరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే శంకర్ సారథ్యంలో శ్రీకాకుళం నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. అన్నివర్గాలకు ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేరవేస్తున్నామన్నారు. అనంతరం అనపర్తి ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.


















# అంబటి.. చిరుగుతుందా చీటీ!

- మాయ చేయబోయిన డీసీసీ అధ్యక్షుడికే షాక్
- పీసీసీ అధ్యక్షురాలి పర్యటననే మమ.. అనిపించే ఎత్తుగడ
- పెయిడ్ ఆర్టిస్టుల గోలతో వ్యవహారం బట్టబయలు
- పార్టీ సొమ్మును కైంకర్యం చేస్తున్నారని ఫిర్యాదులు
- ఆయన తీరుపై షర్మిల తీవ్ర అసహనం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సాక్షాత్తు రాష్ట్ర అధ్యక్షురాలి పర్యటననే మాయ చేసి మమ.. అనిపించేయాలని చూసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కృష్ణారావుకు రాష్ట్ర కాంగ్రెస్ (పీసీసీ) అధ్యక్షురాలు షర్మిల జెల్ల కొట్టారు. షర్మిల పర్యటన సమాచారాన్ని పార్టీ సీనియర్లకు ఇస్తే తన గుట్టంతా బయటపడి పోతుందని భయపడి కృష్ణారావు పీసీసీ అధ్యక్షురాలి పర్యటన గురించి కాంగ్రెస్ నుంచే ఎన్నికై కేంద్రమంత్రిగా చేసిన డాక్టర్ కిల్లి కృపారాణికి గానీ.. నెహ్రూ, ఇందిరాగాంధీల కాలం నుంచి కాంగ్రెస్‌లో కొనసాగుతూ.. రెండు సార్లు ఆమదాలవలస ఎమ్మెల్యేగా పని చేసిన బొడ్డేపల్లి సత్యవతి లాంటి నేతలకు గానీ సమాచారం ఇవ్వకుండా పెయిడ్ ఆర్టిస్టులతో షర్మిల సమావేశాన్ని మేనేజ్ చేసేద్దామని ప్రయత్నించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గురువారం ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సమావేశం ముగిసిన తర్వాత డీసీసీ అధ్యక్షుడిని మార్చాలంటూ షర్మిల విసుగ్గా వెళ్లిపోయారు. జిల్లాలో నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగా ఉన్నవారిని కూడా పిలవకుండా వారి ఆత్మాభిమానం మీద దెబ్బకొట్టి షర్మిల కార్యక్రమం పూర్తి చేసేద్దామని డీసీసీ అధ్యక్షుడు భావించారు. అయితే షర్మిల క్యాడర్‌కు దిశానిర్దేశం చేయకముందే సమావేశానికి వచ్చిన పెయిడ్ ఆర్టిస్టులు తమ డబ్బులిస్తే వెళ్లిపోతామని హడావుడి చేయడంతో ఆ కార్యక్రమం రసాభాసగా మారింది. ఎటువంటి ఫిర్యాదులు తన మీద రాకూడదని ముందుజాగ్రత్త పడిన కృష్ణారావుకు వ్రతం చెడ్డా ఫలితం మాత్రం దక్కలేదు. కాంగ్రెస్ నాయకులు ఆయనపై ఎటువంటి ఫిర్యాదులు చేశారన్న విషయం తెలుసుకునే ముందు పార్టీతో సంబంధం లేని వ్యక్తులు షర్మిలకు ఏమని ఫిర్యాదు చేశారో తెలుసుకుందాం.

### అద్దెల సొమ్ము సొంత ఖాతాలకు

అంబటి కృష్ణారావు తమకు భూమి అమ్ముతానని చాలాకాలం క్రితం డబ్బులు తీసుకున్నాడని, చివరకు తన భార్య మంగళసూత్రాన్ని సైతం అమ్మేసి సొమ్ములిచ్చేశామంటూ గార మండలానికి చెందిన దంపతులు పీసీసీ అధ్యక్షురాలికి ఫిర్యాదు చేశారు. ఇది ప్రైవేటు వ్యవహారమని, తనకు చెప్పి లాభమేమిటని షర్మిల ప్రశ్నిస్తే.. ఎప్పుడూ ఫోనెత్తరని, ఇంటికి వెళ్తే లేరని చెప్పించి పంపించేస్తున్నారని, పొరపాటున కనిపిస్తే కాంగ్రెస్, షర్మిల పేరు చెప్పి భయపెడుతున్నారని, అందుకే మీకు ఫిర్యాదు చేస్తున్నామంటూ వారు వివరించడంతో షర్మిల షాకయ్యారు. ఇక పార్టీ వ్యవహారాలకు సంబంధించి దాదాపు రూ.15 లక్షల వరకు సొమ్ము మాయమైందని షర్మిలకు ఫిర్యాదు అందింది. ఇందిరా విజ్ఞాన్ భవన్‌కు షాపుల నుంచి, కల్యాణ మండపం నుంచి ప్రతి నెలా అందుతున్న అద్దెలను ట్రస్ట్ ఖాతాలో వేయకుండా అంబటి కృష్ణారావు తన సొంతానికి వాడుకున్నారని ఫిర్యాదు చేశారు. 2023లో ఇందిరా విజ్ఞాన్‌భవన్ అద్దెల కోసం ఏఐసీసీ ఆదేశాల మేరకు జాయింట్ అకౌంట్ ప్రారంభించారు. ఇందులోనే ఆ సొమ్ము జమవ్వాలి. అయితే అలా జరక్కపోవడంతో షర్మిలకు ఫిర్యాదు చేశారు. తాను వస్తున్నానని ముందస్తు సమాచారమిచ్చినా కాంగ్రెస్ నేతలెవరూ రాకపోవడంపై షర్మిల అసహనం వ్యక్తం చేయగా, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, ఇచ్ఛాపురం కోఆర్డినేటర్ చక్రవర్తి రెడ్డి, కాంగ్రెస్ మత్స్యకార విభాగం అధ్యక్షుడు కిల్లి శాంతారావు, ఆమదాలవలస కాంగ్రెస్ నాయకుడు బస్వా షన్ముఖరావుతో పాటు మరికొందరు ఆమెకు ఇక్కడ జరుగుతున్న పరిణామాలను వివరించారు.

### ఉద్యోగుల జీతాలకూ ఎగనామం

ఇక్కడ కాంగ్రెస్ ఇన్‌ఛార్జీలుగా ఉన్నవారిపై అంబటి కృష్ణారావు డీసీసీ అధ్యక్షుడైన తర్వాత కేసులు పెట్టారని, ఇప్పుడు కూడా ఈ సమావేశానికి ఎవర్నీ పిలవలేదని ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్‌కు ఇన్‌ఛార్జిగా మహేష్ అనే వ్యక్తిని పెడితే ఆయనా, డీసీసీ అధ్యక్షుడు ఒక్కటైపోయి పార్టీని పాతాళంలోకి తొక్కేస్తున్నారని వారు తెలిపారు. ఇవేవీ తన దృష్టిలో లేవని, తన దగ్గరకు వచ్చుంటే న్యాయం చేసుండేదాన్నని షర్మిల పేర్కొనడం గమనార్హం. దీంతో పాటు డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు బాధ్యతలు చేపట్టిన దగ్గర్నుంచి ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగులకు జీతాలివ్వడం లేదని, పేపర్ బిల్లులు చెల్లించడంలేదని, వస్తున్న అద్దెసొమ్ములు ఏమవుతున్నాయో తెలియడం లేదంటూ షర్మిలకు ప్రత్యేకంగా వివరించారు. ఈ పరిణామాలపై ఆమె అసహనం వ్యక్తం చేస్తూ ఈ జిల్లాకు తన తండ్రి ఎంతో చేశారని, అటువంటి జిల్లాకు తానొస్తే కాంగ్రెస్ నాయకులు ముఖం చాటేశారంటూ, నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని, డీసీసీ అధ్యక్షుడిని మారిస్తే గానీ పరిస్థితి మారేట్టు లేదంటూ ఆమె వెళ్లిపోయారు.



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలికి స్వాగతం పలికేందుకు ఇందిర విజ్ఞాన్‌భవన్ వద్ద ఎదురుచూస్తున్న శ్రేణులు.

## భూముల సమస్యల పరిష్కారానికి
# జూన్ 30 చివరి గడువు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా వెబ్‌ల్యాండ్-2.0లో నమోదైన రైతులు ప్రభుత్వ పథకాలు పొందడంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శుక్రవారం వెల్లడించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా రెవెన్యూ శాఖ సాధారణంగా వసూలుచేసే రూ.500 రుసుమును మినహాయించి, కేవలం రూ.50 నామమాత్రపు దరఖాస్తు రుసుముతోనే జాయింట్ పట్టాల విభజన చేసేందుకు వీలు కల్పించామని ఆయన తెలిపారు. ఈ సేవలు ఉచితంగా లభించనున్నాయని, ఈ నెల 30వ తేదీ లోపు సంబంధిత గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. భూవివరాల విభజన అనంతరం అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఇతర పథకాల కోసం రైతులు అర్హులుగా పరిగణించబడతారని జేసీ స్పష్టం చేశారు. ఇప్పటికే పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జాయింట్ పట్టాదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవలో అర్హత కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు. పేద రైతులకు ఇది గొప్ప అవకాశమని, ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## విద్యార్హతలు సడలింపు రాష్ట్ర బాలల విజయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇటీవల వెలువరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామక నోటిఫికేషన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌ను విద్యార్హతగా పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విద్యార్హతలు సడలించాలనే బలమైన వాదనను రాష్ట్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం వినిపించి విజయం సాధించినట్టు ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, లీగల్ సెల్ అధ్యక్షరాలు ప్రవీణా త్రినాథ్‌లు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నోటిఫికేషన్ విడుదల మొదటి నుంచి పీజీ విద్యార్హతల సడలింపుపై తాము పోరాడుతూనే ఉన్నామని అన్నారు. చట్టంలో గాని, ప్రభుత్వ నియమ నిబంధనల్లో గాని ఎక్కడా విద్యార్హతలపై పొందుపరచలేని విషయాన్ని గుర్తు చేశామన్నారు. పదేళ్లుకు పైగా వివిధ రంగాల్లో బాలలకు చేసే సేవలు మాత్రమే కొలమానమన్న విషయాలతో పాటు గతంలో వెలువరించిన అత్యున్నత కోర్టు తీర్పుల సారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం వాదనను బలపరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం విద్యార్హతలను సడలించి, దరఖాస్తుల గడువు పెంచుతూ చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. ఇది తమ ఫోరంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యావత్ బాలల విజయమని అన్నారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధనలక్ష్మి, ప్రవీణా త్రినాథ్‌లు ధన్యవాదాలు తెలిపారు.


## అద్దెకు ఇవ్వబడును

చిన్నబజారు దూదివారి కోవెల ఎదురుగా
మూడు ఫ్లోర్ల బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును.
ఒక్కో ఫ్లోర్ 1200 చదరపు అందుగులు (20×60)

- వివరాలకు సంప్రదించగలరు -

9866 222 636


## 23 నుంచి బాపూజీ కళామందిర్‌లో
# 'శ్రీ శంకర విజయం' ప్రవచనాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు శ్రీ శంకర విజయం ప్రవచన కార్యక్రమం ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు పెంట వాశిష్ట కార్తికేయ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణామ్నాయ జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం శ్రీ శారదా పీఠం, శృంగేరి అనుబంధ సంస్థ అహం బ్రహ్మాస్మి ఫౌండేషన్ నిర్వహణలో జరుగుతున్న ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రిట్రీట్స్‌లో భాగంగా శ్రీకాకుళం బాపూజీ కళామందిరంలో సోమవారం నుంచి ఐదు రోజులపాటు శ్రీ శంకర విజయంపై ప్రవచనాలు నిర్వహిస్తున్నామన్నారు. రుగ్వేద ఘనాపాఠి బ్రహ్మశ్రీ సంతోష్ కుమార్ శర్మ ప్రవచచాలు చెప్తారని, ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు. ఇతర వివరాలకు వివరాలకు 95022 38017 నెంబరులో తనను సంప్రదించాలని వాశిష్ట కార్తికేయ శర్మ ఆ ప్రకటనలో తెలిపారు.

## బోయిన కుటుంబానికి
# ప్రముఖుల పరామర్శ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర కళింగకోమటిసంఘం అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిన గోవిందరాజులు తల్లి ఇటీవల మరణించడంతో జిల్లాలో ప్రముఖులంతా ఆయన్ను పరామర్శించారు. కోటబొమ్మాళిలో ఆయన నివాసానికి వెళ్లిన మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్‌లు గోవిందరాజులు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ, ఆయన కుమార్తె, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషలు గోవిందరాజులు కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టెక్కలి వైకాపా ఇన్‌ఛార్జి పేరాడ తిలక్, కోణార్క్ శ్రీను తదితరులు పరామర్శించారు.



## ప్రిన్సిపల్‌గా సౌజన్య బాధ్యతలు స్వీకరణ



(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

సోంపేట మండలం బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పి.సౌజన్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న సౌజన్యకి ప్రిన్సిపల్‌గా ఇటీవల పదోన్నతి లభించింది. తాజాగా ఆమెను బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా నియమించారు. డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ వారి ఉత్తర్వుల మేరకు పి.సౌజన్య బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆమెకు అక్కడి అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి దుశ్శాలువతో సత్కరించారు. లెక్చరర్‌గా విజయవంతంగా సేవలందించిన ఆమె ప్రిన్సిపల్‌గా కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సౌజన్య మాట్లాడుతూ అధ్యాపకులు, సిబ్బంది అందరి సహకారంతో బారువ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తొగరాం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యు.వి.ఎన్.వర్మ, కంచిలి కళాశాల ప్రిన్సిపల్ యు.జగదీష్ కుమార్, లెక్చరర్లు రామలక్ష్మి, కిరణ్ కుమారి, భారతి, జయ సుధాకర్, అప్పారావు, రాజశేఖర్‌లతో పాటు బారువ కళాశాల నుంచి మోహన్ రావు, ఇతర లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## జుగా సర్వేతో ఎంతో మేలు
# ఐటీడీఏ ఏపీవో చినబాబు



(సత్యంన్యూస్, సీతంపేట)

ప్రధానమంత్రి జుగా సర్వేతో గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ఎంతో మేలు చేకూరుతుందని ఐటీడీఏ ఏపీవో జి.చినబాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కొత్తూరు మండలం అల్తిలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధార్, రేషన్, ఆరోగ్య కార్డులు, పుట్టినతేదీ ధ్రువపత్రాలు, బ్యాంకు ఖాతాలు, గ్యాస్ కనెక్షన్లు లేనివారు జుగా సర్వే ద్వారా వీటిని పొందవచ్చన్నారు. అంతకు ముందు ఆయన పాతపట్నం మండలం ఎస్ఎస్ మణుగు ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో వండిన ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. 9, 10 తరగతుల్లో విద్యార్థుల మధ్య కూర్చుని ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్న విధానాన్ని, పిల్లలకు అది అర్థమవుతున్న రీతిని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఉన్న మూత్రశాలల వద్ద పరిశుభ్రత మరింత పెంచాలని సూచించారు.








# డాక్టర్ పైడికి లాసెట్‌లో 148వ ర్యాంకు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ పైడి మహేశ్వరరావుకు లాసెట్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో 148వ ర్యాంకు వచ్చింది. రైతుబజార్ పెట్రోల్‌బంక్ ముందు సంజీవని ఆసుపత్రి పేరుతో సేవలందించిన డాక్టర్ పైడి మహేశ్వరరావు సర్జన్‌గాను, పిడియాట్రిషన్‌తో పాటు పలు వైద్య డిగ్రీలు సంపాదించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ఎల్ఎల్‌బి మూడేళ్ల కాలపరిమితి లా కోర్స్ ఎంట్రన్స్ టెస్ట్‌లో 148వ ర్యాంకు సాధించారు. ఈ ఎంట్రన్స్‌కు 40వేల మంది హాజరు కాగా, మెడికల్ ప్రొఫెసర్‌గా ఉన్న పైడి మహేశ్వరరావు ఈ ర్యాంకు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 120 మార్కులకు గాను 103 మార్కులు తెచ్చుకొని క్వాలిఫై అయ్యారు. ఈయన ప్రస్తుతం రాగోలు జెమ్స్ మెడికల్ కళాశాల సర్జెన్సీ ప్రొఫెసర్‌గా చేస్తున్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.